J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS



కాంతి

సంపుటి : 46 సంచిక : 24 13.11.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● స్థానిక సంస్థల ఎన్నికలలో

వైసీపీ బలహీనతే.. టీడీపీకి బలమైందా?

» కూటమి గెలుపు.. పాలనకు ప్రజామోదమా?

» ప్రతిపక్ష నాయకత్వ వైఫల్యానికి లభించిన ప్రతిఫలమా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కొత్త చర్చకు తెరలేపాయి. అధికార తెలుగు దేశం కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో విజయాలను నమోదు చేయలేకపోయింది. పైకి చూస్తే ఇది అధికార పక్షానికి తిరుగులేని విజయంగా కనిపించవచ్చు. కానీ ఎన్నికల ఫలితాలను కేవలం గెలిచిన స్థానాల సంఖ్యతోనే విశ్లేషిస్తే అసలు రాజకీయ వాస్తవాలు మరుగునపడే ప్రమాదం ఉంది. ఓట్ల శాతం, స్థానిక రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, పార్టీల క్షేత్రస్థాయి బలం, నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల ఫలితాలు ఒక ఆసక్తికరమైన వాస్తవాన్ని సూచిస్తున్నాయి. వైసీపీ రాజకీయంగా బలహీనపడినప్పటికీ, ఆ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు పూర్తిగా కనుమరుగైపోలేదు. వివిధ ఎన్నికల గణాంకాల ప్రకారం వైసీపీకి పట్టణ స్థానిక సంస్థల్లో 34.3 శాతం, జడ్పీటీసీ ఎన్నికల్లో 39.7 శాతం ఓట్లు లభించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 40 శాతం ఓట్లను సాధించడం ఆ పార్టీకి ఇంకా గణనీయమైన ప్రజా మద్దతు ఉందనే విషయాన్ని సూచిస్తోంది. అయితే ఆ మద్దతును విజయాలుగా మలచడంలో మాత్రం వైసీపీ విఫలమైందన్నది ఈ ఎన్నికలు వెల్లడించిన ప్రధాన అంశం.

ఓటు బ్యాంకు ఉంది... నడిపించే నాయకత్వమే కరువైందా?

ఎన్నికల్లో ప్రజల అభిమానం ఒక్కటే విజయాన్ని అందించదు. ఆ అభిమానాన్ని ఓట్లుగా, ఓట్లను సీట్లుగా మార్చగల రాజకీయ యంత్రాంగం కూడా అవసరం. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహం, గ్రామ స్థాయి సమన్వయం, పోలింగ్ బూత్ నిర్వహణ, కార్యకర్తలకు భరోసా కల్పించడం ఇలా ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ నాయకత్వ సామర్థ్యం కీలకం. ఈ విషయంలో వైసీపీ అనేక ప్రాంతాల్లో వెనుకబడినట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన రాజకీయ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న ఆ పార్టీ, ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో నాయకత్వ శూన్యతను ఎదుర్కొంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీకి ఓటు వేయాలనే ఆలోచన ఉన్న ఓటర్లు ఉన్నప్పటికీ, వారిని సమన్వయం చేసే నాయకులు ఎక్కడ? కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచే నేతలు ఎక్కడ? ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ ఉనికిని చాటే

2లో



ఏపీలో మరో పీఆర్‌పీ!

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ

బెయిలుపై బయటున్న వ్యక్తి పరివర్తన, రాజనీతి అంటే జనం నమ్ముతారా?

ఈ ఏ-2 తన కొత్త పార్టీతో కేపపాల్-2గా మిగిలిపోతాడా?

జగన్‌పై కక్షసాధింపా.. చంద్రబాబుపై రాజకీయ సమరమా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కీలక వ్యూహకర్తగా, అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి ఇప్పుడు అదే పార్టీకి ప్రత్యామ్నాయంగా 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీ.ఆర్.పీ)తో రాజకీయ రంగప్రవేశం చేశారు. దాదాపు పదిహేనేళ్ల క్రితం మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ (పీఆర్‌పీ) రాజకీయ ప్రయోగం గుర్తుకు తెస్తున్న ఈ కొత్త పీఆర్‌పీ.. రాష్ట్ర రాజకీయాల్లో మూడో శక్తిగా ఎదుగుతుందా? లేక రాజకీయ ఆకాంక్షలకు వేదికగా మాత్రమే మిగిలిపోతుందా? అన్నది ప్రస్తుతం రాజకీయవర్గాల్లో వినిపిస్తున్న ఆసక్తికర చర్చ.

11లో


వెండితెరపై మెరవనున్న

నెల్లూరు నక్షత్రం

▸ 'ఇట్లు అర్జున'గా యువహీరో ఆల్తూరు సాయి అనీష్

▸ నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకి

నెల్లూరు గడ్డకు మరో సినీ గౌరవం దక్కబోతోంది. వ్యాపార, పారిశ్రామిక, ఆధ్యాత్మిక, సినీ రంగాల్లో తమదైన గుర్తింపు సంపాదించుకున్న ఆల్తూరు కుటుంబం నుంచి మరో యువతరం వెండితెరకు పరిచయం కాబోతోంది. ప్రముఖ వ్యాపారవేత్త ఆల్తూరు మహేష్‌రెడ్డి తనయుడు ఆల్తూరు సాయి అనీష్ కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'ఇట్లు అర్జున' నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. నెల్లూరులో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన అనీష్ ఇప్పుడు టాలీవుడ్‌లో హీరోగా తన ప్రతిభని ప్రదర్శించబోతున్నాడు.



నాటి కలే.. నేటి లక్ష్యం!

అనీష్‌కు సినిమాలపై ఆసక్తి ఒక్కసారిగా ఏర్పడింది కాదు. దాని వెనుక ఒక అందమైన బాల్య జ్ఞాపకం ఉంది. నెల్లూరుకు వచ్చిన ప్రతిసారీ ఆయన తాతయ్య ఆదినారాయణరెడ్డి అనీష్‌ని వారాంతాల్లో సినిమాలకు తీసుకెళ్లేవారు. చిన్నతనంలో తాతయ్యతో కలిసి చూసిన సినిమాలు, వెండితెరపై కనిపించే నటీనటులు, ఆ రంగంలోని వైభవం అనీష్ మనసులో చెరగని ముద్ర వేశాయి. అలా సినిమాలు చూస్తూ పెరిగిన ఆ కుర్రోడికి క్రమంగా నటనపై మక్కువ పెరిగింది. చివరకు తన జీవిత లక్ష్యం నటుడిగా మారడమేనని నిర్ణయించుకున్నాడు.

10లో

వైసీపీ బలహీనతే.. టీడీపీకి బలమైందా?

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక నాయకత్వం ఎక్కడ? అన్న ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి. రాజకీయ పార్టీకి అధినేత ఒక్కరే ఉంటే సరిపోదు. ఆ నాయకత్వాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే వందలాది మంది స్థానిక నాయకులు అవసరం. అధినేత ప్రసంగాలు ప్రజల్లోకి వెళ్లవచ్చు. కానీ గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేసేది స్థానిక నాయకుడి విశ్వసనీయత, కార్యకర్తల చొరవ, ప్రజలతో ఉండే నిరంతర సంబంధం. ఈ వ్యవస్థ బలహీనపడితే ఓటు బ్యాంకు ఉన్నా ఎన్నికల ఫలితాల్లో అది ప్రతిఫలించదు. ఇక్కడే వైసీపీ బలహీనత టీడీపీ కూటమికి రాజకీయ బలంగా మారిందన్న విశ్లేషణకు ప్రాధాన్యత ఏర్పడుతోంది.

కూటమి గెలుపు బలుపా... వాపా?

ఇప్పుడు రాజకీయ పరిశీలకుల ముందున్న ప్రధాన ప్రశ్న ఇదే. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కూటమి సాధించిన విజయాన్ని ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చిన కితాబుగా చూడాలా? లేక నాయకత్వ లేమితో ప్రతిపక్షం అందించిన రాజకీయ అవకాశాన్ని అధికార పక్షం సద్వినియోగం చేసుకున్న విజయంగా పరిగణించాలా? ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక హామీలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగావకాశాలు, అమరావతి నిర్మాణం, క్వాంటంవ్యాలీ వంటి సాంకేతిక ప్రాజెక్టులు, అన్నా క్యాంటీన్లు, రహదారుల అభివృద్ధి, పేదలకు గృహవసతి వంటి అంశాలను తన పాలనా విజయాలుగా ప్రచారం చేసుకుంటోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నష్టపోయిందని, ఇప్పుడు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని అధికార పక్షం చెప్తోంది. ఇన్ని హామీలు, ఇన్ని అభివృద్ధి ప్రకటనలు, సంక్షేమ కార్యక్రమాల ప్రచారం మధ్య కూడా కూటమికి లభించిన ఓట్ల శాతాన్ని పరిశీలించకుండా కేవలం గెలిచిన స్థానాల సంఖ్య ఆధారంగా అఖండ ప్రజామోదంగా అభివర్ణించడం సరికాదు. గెలిచిన స్థానాల సంఖ్య ఒక రాజకీయ విజయాన్ని సూచిస్తుంది. కానీ ఓట్ల శాతం ప్రజాభిప్రాయంలోని విస్తృతిని తెలియజేస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించాలి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ విజయాల సందర్భంలో వినిపించిన పాస్ మార్కుల వ్యాఖ్యానాన్ని గుర్తు చేసుకుంటే, ఈ ఎన్నికల్లోనూ కూటమికి లభించిన ఫలితాలను సంపూర్ణ ప్రజామోదంగా కాకుండా, రాజకీయంగా సాధించిన విజయంగా చూడాల్సిన అవసరం ఉంది. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, గ్రామస్థాయి సంబంధాలు, కుల సమీకరణాలు, స్థానిక సమస్యలు, కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీ, ప్రతిపక్ష అభ్యర్థుల బలం వంటి అనేక అంశాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల కూటమి విజయాన్ని తక్కువ చేసి చూడలేం. అదే సమయంలో దానిని ప్రభుత్వానికి లభించిన సంపూర్ణ ప్రజామోదంగా కూడా భావించలేము.

వైసీపీకి ఇది హెచ్చరికా? పునరుజ్జీవానికి అవకాశమా?

జడ్పీటీసీ ఎన్నికల్లో దాదాపు 40 శాతం ఓట్లను సాధించడం వైసీపీకి ఒక ముఖ్యమైన రాజకీయ సంకేతం. పార్టీకి ఇంకా గణనీయమైన ఓటర్ల మద్దతు ఉందని ఇది సూచిస్తోంది. అయితే ఆ మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందనే హామీ మాత్రం కాదు. ప్రజల మద్దతును నిలబెట్టుకోవాలంటే పార్టీ తన రాజకీయ వ్యవహారశైలిని, సంస్థాగత నిర్మాణాన్ని సమీక్షించుకోవాలి. మొదటగా పార్టీ అధిష్ఠానం తన నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా మార్చుకోవాలి. రెండవది, ప్రతి నియోజకవర్గంలో ప్రజలతో నిరంతర సంబంధం కలిగి ఉండే నాయకులను గుర్తించి వారికి బాధ్యతలు అప్పగించాలి. మూడవది, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచే నాయకత్వాన్ని నిర్మించాలి. నాలుగవది, కొత్త తరం నాయకులకు అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వెళ్లే రాజకీయ సంస్కృతికి స్వస్తిచెప్పాలి. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి. ప్రభుత్వ నిర్ణయాల్లో లోపాలుంటే వాటిని ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకురావాలి. విమర్శలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ విధానాలను కూడా ప్రతిపాదించాలి. ప్రజలకు కనిపించే, ప్రజల కోసం పనిచేసే నాయకత్వమే పార్టీకి తిరిగి రాజకీయ విశ్వసనీయతను తీసుకురాగలదు. వైసీపీకి ఇప్పుడు కావాల్సింది కేవలం రాజకీయ ప్రకటనలు కాదు. క్షేత్రస్థాయిలో కనిపించే నాయకులు, నమ్మకమైన కార్యకర్తలు, సమన్వయంతో పనిచేసే వ్యవస్థ. అధినేతపై ఉన్న అభిమానాన్ని పార్టీ సంస్థాగత బలంగా మార్చ గలిగితేనే ఆ పార్టీ తన రాజకీయ శక్తిని తిరిగి నిరూపించుకోగలదు.

నేటి గెలుపు.. రేపటి విజయానికి హామీ కాదు!

2026 స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం కూటమికి రాజకీయంగా విజయాన్ని అందించాయి. అదే సమయంలో వైసీపీకి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశాయి. అధికార పక్షానికి ఈ ఫలితాలు సంతోషాన్నిచ్చినా, ప్రజల మద్దతు శాశ్వతమని భావించడానికి వీల్లేదు. ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాల ప్రభావం, నిరుద్యోగ సమస్య పరిష్కారం, ప్రజలకు అందే పాలన నాణ్యత ఇవే భవిష్యత్తులో ప్రభుత్వానికి అసలైన పరీక్షలు కానున్నాయి. రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదు. ప్రజాభిమానం కూడా ఒకే విధంగా కొనసాగదు. నేడు గెలిచిన పార్టీ రేపు ఓడిపోవచ్చు. నేడు ఓడిన పార్టీ రేపు పుంజుకోవచ్చు. కానీ అందుకు అవసరమైన కృషి, నాయకత్వం, ప్రజలతో అనుబంధం నిరంతరం కొనసాగాలి. ఈ ఎన్నికలు ఇచ్చిన సందేశం చాలా స్పష్టం. వైసీపీకి ఓటర్లు లేరని చెప్పలేం. ఓటర్లు ఉన్నారు. కానీ వారి మద్దతును విజయంగా మలిచే నాయకత్వం, సమర్థమైన ఎన్నికల యంత్రాంగం అవసరం. మరోవైపు టీడీపీ కూటమికి అధికారం ఉంది, ఎన్నికల విజయం ఉంది. అయితే ఆ విజయాన్ని ప్రజల నమ్మకంగా శాశ్వతంగా మార్చుకోవాలంటే పాలనలో హామీలను ఆచరణలో చూపించాల్సిందే.

వైసీపీకి ఓటు బ్యాంకు ఉంది... దానికి నాయకత్వం తోడవ్వాలి. టీడీపీకి అధికారం ఉంది... దానికి ప్రజల విశ్వాసం నిరంతరం అండగా నిలవాలి. ఎందుకంటే ఎన్నికల్లో గెలవడం ఒక ఘట్టం మాత్రమే. ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలవడమే అసలైన విజయం!



నిస్వార్థ వైద్య సేవకు నిలువెత్తు నిర్వచనం

డాక్టర్ లావణ్య అకాల మరణం

- నెల్లూరు వైద్యరంగంలో తీరని విషాదం

వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా, మానవ సేవకు పవిత్రమైన మార్గంగా భావించిన ఓ యువ వైద్యురాలి జీవన ప్రయాణం అర్ధాంతరంగా ముగిసింది. వేలాదిమంది రోగులకు వైద్యం అందించి, మరెందరికో ధైర్యాన్ని నింపి, వైద్య విద్యార్థులకు జ్ఞానాన్ని పంచుతూ, నిరుపేదలకు నిస్వార్థ సేవలందించిన ఎనెల్ హాస్పిటల్స్ నిర్వాహకురాలు డాక్టర్ కుంకాల లావణ్య ఇక లేరన్న వార్త నెల్లూరు ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. నవంబర్ 7వ తేదీ శనివారం ఆమె ఆకస్మిక మరణం కుటుంబసభ్యులనే కాకుండా, ఆమె వైద్య సేవలు పొందిన రోగులను, సహచర వైద్యులను, విద్యార్థులను, అభిమానులను సైతం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. డాక్టర్ లావణ్య 1993 జనవరి 31న జన్మించారు. కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్-శ్రీమతి లక్ష్మిలకి ఆమె ప్రథమ కుమార్తె. లావణ్యకి చెల్లెలు కైవల్య, భర్త డాక్టర్ నాగేంద్రప్రసాద్, తొమ్మిదేళ్ల కుమారుడు కార్తీక్, రెండేళ్ల కుమార్తె మీనాక్షి వున్నారు.

కేవలం 33 ఏళ్ల ప్రాయంలోనే వైద్య రంగంలో విశేష ప్రతిభను చాటుకుని, సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన డాక్టర్ లావణ్య మరణం నెల్లూరు వైద్యరంగానికి తీరని లోటు. యువ డాక్టర్‌గా ఆమె అందించిన చికిత్సలు, అధ్యాపకురాలిగా పంచిన విజ్ఞానం, సామాజిక సేవకురాలిగా చూపిన మానవత్వం ఆ యువ మానవతామూర్తిని అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలుపుతాయి. ఒకవైపు ఉన్నత వైద్య విద్యతో అంతర్జాతీయ వేదికలపై తన ప్రతిభను చాటుకుంటూనే, మరోవైపు పేదలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన జీవిత లక్ష్యంగా మలుచుకున్న లావణ్య జీవితం నేటి యువతకి స్ఫూర్తిదాయకం. అతి చిన్న వయసులోనే ఆమె సాధించిన విజయాలు అసాధారణమైనవి. బెంగళూరులో బాల్య విద్యాభ్యాసం అనంతరం నెల్లూరులో 3వతరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది లావణ్య. ఆ తరువాత నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన లావణ్య, మళ్ళీ బెంగళూరులో డీఎన్‌బీ జనరల్ మెడిసిన్, చెన్నై శ్రీరామచంద్ర వైద్య కళాశాలలో న్యూరాలజీలో డీఎం పూర్తి చేశారు. అంతే కాదు, న్యూరాలజీలో ప్రతిభకు గుర్తింపుగా గోల్డ్ మెడల్ సాధించారు. ఉన్నత విద్య, అపారమైన వైద్య పరిజ్ఞానం ఉన్నప్పటికీ ఆమెలో అహంకారం కనిపించేది కాదు. రోగుల పట్ల ఆప్యాయత, పలకరింపులో ఆత్మీయత, వైద్యం అందించడంలో అంకితభావం ఆమె ప్రత్యేకతలు.

2022లో ఆమె తండ్రి కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్ స్థాపించిన ఎనెల్ హాస్పిటల్స్ ద్వారా లావణ్య తన వైద్య సేవలకు మరింత విస్తృతమైన రూపం ఇచ్చారు. ప్రతిభగలిగిన గుండె వైద్య నిపుణుడిగా ప్రసిద్ధి చెందిన తన భర్త డాక్టర్ నాగేంద్రప్రసాద్‌తో కలిసి ఆసుపత్రి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. 2024 నుంచి కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్‌గా వేలాది మంది రోగులకు వైద్య సేవలు అందించారు. దాదాపు పదివేల మంది రోగులకు చికిత్స అందించారంటే ఆమె వైద్యసేవల విస్తృతి అర్థమవుతుంది. ముఖ్యంగా మెదడు, నాడీ వ్యవస్థకు సంబంధించిన ఆటో ఇమ్యూన్ వ్యాధులపై ప్రత్యేక ఆసక్తితో పరిశోధనలు సాగించారు.

ఆమె సేవలు కేవలం ఆసుపత్రి గోడలకే పరిమితం కాలేదు. నెల్లూరులోని ఏసీ. సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆమె అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు వైద్య శాస్త్రాన్ని బోధించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే తపనతో గొలగమూడి క్షేత్రంలో ప్రతి నెలా ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరాలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా న్యూరాలజీ వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తన తండ్రి సహకారంతో 'డాక్టర్ లావణ్య మొబైల్ న్యూరో కేర్' సేవలను ప్రారంభించారు. నెలకు రెండుసార్లు మారుమూల గ్రామాలకు వెళ్లి ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందించడం ఆమె మానవతా దృక్పథానికి నిదర్శనం.

ఆమె వ్యక్తిగత జీవితంలోని అతి కీలక అనుభవాన్ని కూడా ఇతరులకు ఉపయోగపడేలా మలుచుకున్న స్ఫూర్తిప్రదాత లావణ్య. 2025లో తాను "మయస్థీనియా గ్రావిస్" అనే ఆటో ఇమ్యూన్ వ్యాధి బారిన పడినప్పుడు, తన వైద్య పరిజ్ఞానంతో వ్యాధిని గుర్తించి చికిత్స పొందారు. ఆరు నెలల పాటు కఠినమైన చికిత్స, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ధైర్యంగా కోలుకున్నారు. ఆ అనుభవాన్ని తనకే పరిమితం చేసుకోకుండా, ఆ వ్యాధిపై విస్తృతంగా అధ్యయనం చేశారు. అంతర్జాతీయ "మయస్థీనియా గ్రావిస్" సహాయక బృందంలో సభ్యురాలిగా ఇతర రోగులకు ధైర్యం చెప్తూ , చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సులో "మయస్థీనియా గ్రావిస్" పై తన పరిశోధనను సమర్పించడం, తాజాగా జైపూర్‌లో జరిగిన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ జాతీయ సదస్సులో ప్రసంగించడం ఆమె ప్రతిభకు నిదర్శనాలు. ఇంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా, ఎక్కడా అహాన్ని ప్రదర్శించకుండా సామాన్యులకు అందుబాటులో ఉంటూ సేవ చేయడానికే ఆమె ప్రాధాన్యత ఇచ్చేవారు.

లావణ్య వ్యక్తిత్వంలో మరో గొప్ప కోణం సామాజిక సేవ. తన ఇద్దరు పిల్లల పుట్టినరోజులైన ప్రతి నెల ఒకటి, 21వ తేదీలను గుర్తుచేసుకుంటూ నిరుపేదలకు స్వయంగా ఆహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహించేవారు. ఒకవైపు వృత్తిపరమైన బాధ్యతలు, మరోవైపు కుటుంబ బాధ్యతలు, ఇంకోవైపు సామాజిక సేవ, ఇలా ప్రతి రంగంలోనూ ఆమె తనదైన ముద్ర వేసుకున్నారు. విధి ఎంత కఠినమైందో ఆమె మరణం మరోసారి గుర్తుచేసింది. మరణానికి ముందు రోజు కూడా ఆసుపత్రికి వెళ్లి ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగులకు వైద్యసేవలు అందించారు. తన ఆరోగ్యాన్ని, వ్యక్తిగత సౌకర్యాలను పక్కనపెట్టి రోగుల సేవకే ప్రాధాన్యత ఇచ్చిన ఆమె, ఇంత త్వరగా ఈ లోకానికి దూరమవుతారని ఎవరూ ఊహించలేదు.

ఆమె అమ్మా, నాన్నలు వారి కుమార్తెను కోల్పోవడం ఎంతటి హృదయవిదారకమో మాటల్లో చెప్పలేం. బోలెడంత భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న భర్త తన జీవిత భాగస్వామిని, అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు తమ కన్నతల్లిని కోల్పోవడం వారి జీవితాలలో భర్తీ చేయలేని శూన్యం. కుటుంబసభ్యులకు కలిగిన ఈ విషాదం పూడ్చలేనిది. ముఖ్యంగా తల్లిని కోల్పోయిన ఆ చిన్నారుల భవిష్యత్తును తలచుకుంటే మనసు కలచివేస్తుంది. యువవైద్యురాలు డాక్టర్ లావణ్య మరణం ఒక కుటుంబానికే కాదు, నెల్లూరు వైద్యరంగానికి, ఆమె సేవలు పొందిన వేలాది మంది రోగులకు తీరనిలోటు. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె అందించిన వైద్య సేవలు, పేదల పట్ల చూపిన కరుణ, వైద్య విద్యార్థులకు అందించిన జ్ఞానం, గ్రామీణ ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.

వ్యక్తులు జీవించిన సంవత్సరాల సంఖ్య కంటే, ఆ జీవితంలో వారు ఎంత మందికి మేలు చేశారన్నదే ముఖ్యం. ఆ కొలమానంలో డాక్టర్ లావణ్య జీవితం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆమె ఆశయాలను, సేవా కార్యక్రమాలను కుటుంబ సభ్యులు, ఎనెల్ హాస్పిటల్స్ యాజమాన్యం కొనసాగించగలిగితే అదే ఆమెకు అందించే నిజమైన నివాళి. డాక్టర్ లావణ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది 'లాయర్!'..

క్యాన్సర్ ఆసుపత్రికి..10 లక్షల విరాళం

- తండ్రి జ్ఞాపకార్థం విరాళం అందించిన తాళ్ళూరి సోదరులు
- దాతలను అభినందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకి విరాళం చెక్కుని అందజేస్తున్న తాళ్ళూరి సోదరులు

నెల్లూరులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి దగదర్తి గ్రామానికి చెందిన తాళ్ళూరి వెంకట కృష్ణప్రసాద్, తాళ్ళూరి రవిప్రసాద్‌లు తమ తండ్రి స్వర్గీయ తాళ్ళూరి రమణయ్యనాయుడు జ్ఞాపకార్థం ఈనెల 11న 10 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఐఆర్‌సీఎస్ క్యాన్సర్ హాస్పిటల్ కోఆర్డినేటర్ యాలమూరి రంగయ్య నాయుడు, డీఆర్ఓ ఎన్. విజయ్‌కుమార్ సమక్షంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వారు ఈ విరాళాన్ని అందజేశారు. పేద క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో, తమ తండ్రి స్మారకార్థం ఈ విరాళాన్ని అందించినట్లు తాళ్ళూరి సోదరులు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌తో.. రూప్‌కుమార్ భేటీ



రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌ను నెల్లూరు నగర మేయర్‌గా విజయం సాధించిన పోలుబోయిన రూప్ కుమార్‌యాదవ్ ఇటీవల విజయవాడలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. మేయర్‌గా గెలిచినందుకు శుభాకాంక్షలు చెప్పి, మంత్రి సత్య కూడా ఆయన్ను అభినందించి సత్కరించారు. రూప్‌కుమార్ వెంట 20వ డివిజన్ కార్పొరేటర్ గణేశం వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో.. శివదీక్షలు ప్రారంభం

- దీక్షాధారులకు వస్త్రాలు అందజేసిన ఆల్తూరు గిరిష్‌కుమార్‌రెడ్డి

కార్తీకమాసం ఆరంభం సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర దేవాలయంలో ఈనెల 10వ తేదీ నుంచి శివదీక్షలు ప్రారంభమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు శివదీక్షలు స్వీకరించారు. ప్రముఖ శివభక్తుడు, ఆధ్యాత్మిక సేవాతత్పరుడు.. దాత ఆల్తూరు గిరీష్ కుమార్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు కలసి శివభక్తులకు శివమాలలు, వస్త్రాలు అంద



జేశారు. ఈ సందర్భంగా గిరీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కార్తీక మాసంలో శివ పూజలు, శివ దీక్షలు చేయడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. డిసెంబరు 8వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో శివదీక్షలు కొనసాగుతాయన్నారు. గత పదిహేను సంవత్సరాలుగా శివదీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ దీక్షల సమయంలో ప్రతిరోజూ శివనామ స్మరణలతో, భజనలతో భక్తులు తరిస్తారని తెలిపారు. శివదీక్ష తీసుకున్నవారికి ప్రతి రోజూ సాయంత్రం అల్పాహారం కూడా అందజేస్తున్నామన్నారు. దీక్షల చివరి రోజున స్థానిక రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయం వద్ద నుంచి పవిత్ర జలాలతో కలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, మూలస్థానేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ శివదీక్షల ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, మాజీ ఇఓ ఆరంబాకం వేణుగోపాల్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



లాయర్
నవంబర్ 13, 2026

ఆకాశమే హద్దుగా..'ఏఐ' సాంకేతికత!

సాఫ్ట్‌వేర్ రంగంలో నానాటికీ అద్భుతాలు చోటుచేసుకుంటున్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-కృత్రిమ మేధస్సు) సాంకేతిక పరిజ్ఞానం ఆకాశమే హద్దుగా రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. ఇప్పటికే ఏఐ సాంకేతికత ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో అద్భుతమైన పరిణామాలను తీసుకువస్తుంటే, తాజాగా 'ఏజెంటిక్ ఏఐ' మరో సరికొత్త విప్లవంగా ముందుకు వస్తోంది. మనిషి ఆదేశాలను మాత్రమే అనుసరించే కృత్రిమ మేధస్సు నుంచి, మనిషి తరపున ఆలోచించి నిర్ణయాలు తీసుకుని, ఆ పనులను స్వయంగా పూర్తిచేసే స్థాయికి సాంకేతికత ఎదుగుతుండడం అద్వితీయమనే చెప్పాలి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'ఏజెంటిక్ ఏఐ' ప్రకంపనలు సృష్టిస్తోంది. అన్నిదేశాల్లోనూ దీనిపై చర్చలు సాగుతున్నాయి. ఒక్క సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాకుండా వైద్యం, విద్య, బ్యాంకింగ్, వ్యాపారాల నిర్వహణ, పరిశోధనలు, తయారీరంగాలతో పాటు మీడియా రంగంలో సమాచార సేకరణలు పరిశోధనలకు ఉపయోగపడుతూ ఏజెంటిక్ ఏఐ కీలక మార్పులకు నాంది పలుకుతోందని నిపుణులు చెప్తున్నారు. దీని ద్వారా భవిష్యత్తులో మనం కంప్యూటర్లకు పనిచెప్పే విధానాన్ని, సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహించే విధానాలను కూడా ఇది పూర్తిగా మార్చేసి ఇంకా వేగవంతంగా నిర్వహిస్తుందని కూడా భావిస్తున్నారు. ఇప్పటివరకు మనం అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, సమాచారాన్ని విశ్లేషించడం, అంశాలను రూపొందించడం, చిత్రాలను వేయడం వంటి పనులను ముమ్మరంగా చేస్తున్న ఏఐ వ్యవస్థలు.. త్వరలోనే స్వతంత్రంగా పనులను పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించే దశకు వస్తుండడం నిజంగా సాంకేతికరంగంలో ఒక గొప్ప పరిణామమనే చెప్పాలి. మనం నిర్దేశించిన అంశాన్ని అర్థం చేసుకుని ఆ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన సమాచారాన్నివ్వడం, డిజిటల్ సాధనాలతో పనుల పురోగతిని పరిశీలించడం, వంటి అనూహ్యమైన సామర్థ్యాలతో ఇప్పుడు 'ఏజెంటింగ్ ఏఐ' ముందుకు వస్తుండడాన్ని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. సాధారణ ఏఐ ప్రశ్నలకి సమాధానాలు ఇస్తుంది, అయితే ఏజెంటింగ్ ఏఐ సంబంధిత లక్ష్యాన్ని సాధించే దిశగా పనిచేస్తుంది. మనం ఇచ్చే సూచనలపై ఆధారపడి ఏఐ పని చేస్తే, స్వయంగా పనులను రూపొందించడం, ఆ పనులను సమన్వయం చేయడం వంటి అమోఘమైన కార్యాలను ఏజెంటింగ్ ఏఐ దిగ్విజయంగా పూర్తిచేస్తుందని అంటున్నారు. దీంతో సాఫ్ట్‌వేర్ రంగంలో ఏజెంటింగ్ ఏఐకి ప్రాధాన్యత పెరుగుతుందని భావిస్తున్నారు. సంస్థల లావాదేవీల్లోను, అమ్మకాలు, కొనుగోళ్ళు, మార్కెటింగ్ వంటి విభాగాల్లో ఇది బాగా ఉపయోగపడుతుందని, వేలాది పేజీల సమాచారాన్ని సేకరించి నివేదికలు తయారుచేయడం, మార్కెట్ గణాంకాలను విశ్లేషించి అవసరమైన అంశాలను సూచించడం వంటి వన్నీ ఏజెంటింగ్ ఏఐ ప్రత్యేకతలుగా ఉంటాయని సాఫ్ట్‌వేర్ నిపుణులు చెప్తున్నారు. ప్రపంచ మార్కెట్‌లో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆసక్తిచూపేవారికి ఏజెంటిక్ ఏఐ బాగా ఉపయోగపడుతుందని కూడా చెప్తున్నారు. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, సాంకేతిక వ్యవస్థలు కొన్నిసార్లు పొరపాటుపడే అవకాశాలు కూడా ఉంటాయి. వాటి సామర్థ్యాలు పెరిగినకొద్దీ కొత్త సమస్యలు కూడా వస్తుంటాయి. తప్పుడు సమాచారం, డేటా గోప్యత ఉల్లంఘన, సైబర్‌దాడులు వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. అందువల్ల సమాచారం దుర్వినియోగం కాకుండా ఎవరికి వారు ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షించుకుంటూ ఉండడం కూడా అవసరమంటున్నారు నిపుణులు. ముఖ్యమైన విషయాల్లో కీలకమైన నిర్ణయాలన్నీ ఎవరికి వారు స్వయంగా చూసుకోవాల్సి ఉంటుంది. వ్యక్తిగత పర్యవేక్షణ అనేది అత్యంత ప్రధానమైనదని గమనించాలి. ఏదేమైనా నేటి ఆధునిక కాలంలో అత్యంతాధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాలు శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, ఏజెంటిక్ ఏఐ లాంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో రంగంలోకి వస్తే..మనిషి చేసే పని విధానాల్లోనూ భారీ మార్పులు వస్తాయని భావిస్తున్నారు. భవిష్యత్తులో ఇది మరింతగా వృద్ధి చెంది ఒకేసారి బహుళ ప్రయోజనాలు అందించే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. ఇలాంటి కొత్త వ్యవస్థలు వచ్చినప్పుడల్లా, అప్పటిదాకా ఆయా రంగంల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ వ్యవస్థలను, సాంకేతిక నైపుణ్యాలను అవగాహన చేసుకోవడం తప్పనిసరి అవుతోంది. సాంకేతికత పెరిగిపోయి క్రమేణా ఉద్యోగాల స్వరూపాలు కూడా మారిపోతున్న నేటి పరిస్థితుల్లో, ఆ వ్యవస్థలు నైతిక ప్రమాణాలు, పారదర్శకత, ఖచ్చితత్వం, భద్రత వంటివాటితో సమతుల్యంగా సాగినప్పుడే ఇలాంటి సాంకేతిక విప్లవం వల్ల సమాజానికి మరింతగా మేలు చేకూరుతుందని అనుకోవచ్చు.

నెల్లూరు నగరాభివృద్ధికి ఇదే మంచి తరుణం!



నెల్లూరు నగరపాలక సంస్థలో త్వరలో కొత్త నాయకత్వం కొలువుదీరనుండటం నగర ప్రజల్లో ఎన్నో ఆశలు రేకెత్తిస్తోంది. ఇప్పటివరకు 54 మంది సభ్యులతో ఉన్న కౌన్సిల్ సంఖ్య 72కు పెరగడం, డివిజన్ల సంఖ్య విస్తరించడం నగర పాలనలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని మరింత పెంచే పరిణామం. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ మార్పు స్వాగతించదగినది. దీనికితోడు మన నెల్లూరు వారైన డాక్టర్ పొంగూరు నారాయణ గారు మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తుండటం నగర అభివృద్ధికి మరింత సానుకూల అంశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నెల్లూరు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. ముఖ్యంగా నగర ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం నెల్లూరులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లు సక్రమంగా పనిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై పెరిగిన ఆక్రమణల కారణంగా రహదారుల వెడల్పు తగ్గిపోయి ట్రాఫిక్ కష్టాలు మరింత పెరుగుతున్నాయి. మరోవైపు పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపివేయడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురై వ్యాపార అంగళ్లుగా అవతరించాయి. దీంతో పాదచారులు సైతం రోడ్లపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొత్త పాలకవర్గం ఈ సమస్యలను తాత్కాలిక చర్యలతో కాకుండా సమగ్ర ప్రణాళికతో పరిష్కరించాలి. ట్రాఫిక్ సిగ్నళ్లను నిరంతరం పనిచేసేలా చూడటం, రోడ్లపై ఆక్రమణలను తొలగించడం, క్రమబద్ధమైన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలి. నెల్లూరుకు ఇప్పుడు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి. విస్తరించిన కౌన్సిల్, కొత్త నాయకత్వం, ఇదే ప్రాంతానికి చెందిన మున్సిపల్ శాఖ మంత్రి.. ఈ మూడింటి సమన్వయంతో నగర అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చు. రాజకీయాలకు, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలకులు పనిచేయాలి. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ, పారదర్శకమైన పాలన అందించాలి. నెల్లూరు నగరం కేవలం విస్తీర్ణంలోనే కాకుండా అభివృద్ధి, పరిశుభ్రత, రవాణా సౌకర్యాలు, ప్రజా జీవన ప్రమాణాల్లోనూ ఆదర్శంగా నిలవాలి. కొత్త పాలకవర్గం ఈ దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తుందని నగర ప్రజలు ఆశిస్తున్నారు. నగరాభివృద్ధికి లభించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలి. ఇందుకు ఇదే మంచి తరుణం.

ఆర్.పి.రామయ్య, కొండాయపాళెం.

తెలుగు రాష్ట్రాలకు కావల్సింది ఇదే!



తెలుగు రాష్ట్రాల్లో మరోసారి జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం చర్చనీయాంశంగా మారింది. తన భార్య అన్నా లెజినోవాతో విడిపోతున్నట్లు పవన్ కల్యాణ్ సంయుక్త ప్రకటన చేయడంతో ఈ అంశంపై మీడియా, సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. 2013లో వివాహం చేసుకున్న ఈ జంట పరస్పర అవగాహనతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించింది. ఇది పవన్ కల్యాణ్ మూడో వివాహ బంధం ముగింపు దిశగా సాగుతున్న పరిణామం.

సాధారణంగా వివాహ బంధం నుంచి విడిపోవడం అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే, ప్రజాప్రతినిధిగా, కీలకమైన ప్రభుత్వ పదవిలో ఉన్న వ్యక్తి జీవితానికి సంబంధించిన వార్తలు బహిరంగ చర్చకు రావడం సహజం. కానీ, ఈసారి ఈ వ్యవహారం నేపథ్యంలో చోటుచేసుకున్న ఒక రాజకీయ పరిణామం ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. పవన్ విడాకుల విషయంపై విమర్శలు చేయకూడదంటూ ప్రధాన రాజకీయ పార్టీలు తమ శ్రేణులకు ఇచ్చిన ఆదేశాలు ఆహ్వానించదగ్గ పరిణామం.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధిష్ఠానం తమ నాయకులు, కార్యకర్తలు, అధికార ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలు పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని స్పష్టమైన సూచనలు జారీ చేసింది. వ్యక్తిగత విషయాలపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చల్లో పాల్గొనడం, సంబంధిత పోస్టులను షేర్ చేయడం వంటివాటికి దూరంగా ఉండాలని నాలుగు అంశాలతో కూడిన సూచనలు విడుదల చేసింది. మరోవైపు, అధికార కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన ఐటీ విభాగం (ఐటీడీపీ) కూడా ఈ విషయంలో అనుచిత వ్యాఖ్యలను సహించబోమని ప్రకటించింది. ఇలాంటి వ్యాఖ్యలు చేసే తమ విభాగానికి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా ఖాతాలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.తెలుగుదేశం నుంచి ఇలాంటి ప్రకటన రావడంలో పెద్దగా ఆశ్చర్యం లేకపోవచ్చు. ఎందుకంటే, పవన్ కల్యాణ్ ప్రస్తుత ప్రభుత్వంలో కీలక భాగస్వామి. అయితే, తీవ్ర రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న వైసీపీ కూడా ఇదే తరహా వైఖరి తీసుకోవడం గమనించదగిన పరిణామం. గతంలో ఈ రెండు పార్టీల మధ్య రాజకీయ విమర్శలు తరచూ వ్యక్తిగత అంశాల వరకు వెళ్లిన నేపథ్యంలో తాజా ఆదేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

2023లోనూ, 2024 ఎన్నికల ప్రచార సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభల్లో పవన్ కల్యాణ్ వివాహాలు, విడాకుల అంశాన్ని ప్రస్తావిస్తూ వ్యక్తిగత విమర్శలు చేశారు. దీంతో అప్పట్లో ఇరుపార్టీల మధ్య రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరాయి. 2021 నవంబరులో అసెంబ్లీలో తన భార్య భువనేశ్వరిపై వైసీపీ సభ్యులు వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారంటూ అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సభ నుంచి బయటకు వచ్చి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ వివాదం అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మహిళలను, కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేతలు అప్పట్లో చేసిన వ్యక్తిగత హనన వైఖరిని తటస్థంగా ఉండే సామాన్య ప్రజలు కూడా తీవ్రంగా నిరసించారు, అసహ్యించుకున్నారు. తదనంతర పరిణామాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి దారితీసిన అనేక కారణాల్లో ఈ 'వ్యక్తిగత దూషణల రాజకీయం' కూడా ప్రధానమైన ఒక అంశమని విశ్లేషణలు వెలువడ్డాయి.

బహుశా ఆ చేదు అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకునే వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఈసారి ముందస్తు జాగ్రత్త వహించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అసలే ఇటీవల జరిగిన పురపాలక ఎన్నికలు, స్థానిక పరిషత్తు ఎన్నికల్లో కూడా వైసీపీకి తీవ్రమైన చేదు ఫలితాలే ఎదురయ్యాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో పవన్ కల్యాణ్ వ్యక్తిగత విషయాన్ని మళ్ళీ రాజకీయ అంశంగా మార్చి విమర్శలు చేస్తే, పార్టీకి రాజకీయంగా మరింత నష్టం కలిగే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతోనే వైసీపీ తమ పాత వైఖరిని పూర్తిగా మార్చుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కారణం ఏదైనా, వ్యక్తిగత అంశాలపై విమర్శలకు దూరంగా ఉండాలనే నిర్ణయం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు శుభసూచకం.

రాజకీయ విమర్శలు ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఆర్థిక విధానాలు, ప్రజాప్రతినిధుల పనితీరు వంటి అంశాల చుట్టూనే సాగాలి. రాజకీయ వేదికలపై ఆరోగ్యకరమైన చర్చలు, వాదోపవాదాలు జరిగినప్పుడే అది రాష్ట్ర భవిష్యత్తుకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు శ్రీరామరక్ష అవుతుంది. అధికార పక్షం తప్పులను ఆధారాలతో ఎత్తిచూపి, ప్రజల తరపున ప్రశ్నించడం ప్రతిపక్షాల ప్రధాన బాధ్యత. అదే ప్రతిపక్షాలకు గౌరవం తెచ్చిపెడుతుంది. అదే సమయంలో అధికార పక్షం కూడా నిర్మాణాత్మక విమర్శలను స్వీకరించాలి. ఇలాంటి ఆరోగ్యకరమైన చర్చలే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. అంతే తప్ప, వ్యక్తిగత అంశాల్లో విమర్శలు ప్రజలకు గానీ, రాష్ట్రానికి గానీ ఏమాత్రం మేలు చేయవు. తమకు మేలు చేయని పార్టీలను ప్రజలు ఎప్పుడూ ఆదరించరు, అక్కున చేర్చుకోరు. ఈ సత్యాన్ని గ్రహించి రాజకీయ నాయకులు నడుచుకుంటేనే మన ప్రజాస్వామ్యానికి నిజమైన బలం! ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తుల విధానాలు, నిర్ణయాలు, పాలనా తీరుపై విమర్శలకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. అయితే, వారి కుటుంబ సభ్యులను, వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకుని చేసే వ్యాఖ్యలకు, రాజకీయ విమర్శలకు ఉన్నంత సమర్థన ప్రజల నుంచి ఉండదు. ఒక పార్టీ తన ప్రత్యర్థి పట్ల పాటించే గౌరవం, సంయమనం కూడా ఆ పార్టీ రాజకీయ సంస్కృతిలో భాగమే. ఈ విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఒకే ప్రమాణం వర్తించాలి. రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను విమర్శలకు వస్తువులుగా మార్చకూడదనే సంస్కృతి అన్ని పార్టీల్లోనూ స్థిరపడాలి. సోషల్ మీడియా వేదికలపై కూడా ఇదే సంయమనం కనిపించాలి. ప్రజా సమస్యలపై పోరాడే రాజకీయాలు విస్తరించి, వ్యక్తిగత దూషణల రాజకీయాలు తగ్గినప్పుడే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం దిశగా మనం అడుగులు వేయగలం!



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

ఎన్నిక ఏదైనా..గెలుపు కూటమిదే!

అది ఈవీఎం అయినా, బ్యాలెట్‌పేపర్ అయినా, మున్సిపల్ ఎన్నికలైనా, జడ్పీ, పంచాయతీ ఎన్నికలైనా సరే.. ఎన్నిక ఏదైనా గెలుపు కూటమి పార్టీలదేనని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఈ ఎన్నికల్లో అద్భుతమైన తీర్పునిచ్చారని, తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసి, వైస్సార్సీపీ అధ్యక్షుడిగా ఉన్న జగన్‌కు ఓటు వేసే ఓపిక లేకపోవడం విచారకరమని, అనలు స్థానిక సంస్థల ఎన్నికల వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు, వైస్సార్సీపీ నేతలకు లేదని ఆయన విమర్శించారు. వైసీపీ నేతలు మోసపూరితంగా రిజర్వేషన్ వివాదాన్ని సృష్టించారని, న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారని, అంతేకాక 'సర్' ఓటర్ లిస్టు ద్వారా లక్షలాదిమంది వైసీపీ అభిమానుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, తమకు పాత ఓటర్ లిస్టుతోనే ఎన్నికలు జరపాలని ఆందోళనలు చేశారని ఆయన గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని జగన్ ఇలాంటి కుయుక్తులన్నీ పన్నారన్నారు. ఎన్నికలను ఏ ఓటర్ లిస్టు ప్రకారం నిర్వహించాలో నిర్ణయించేది ఎన్నికల సంఘమే తప్ప కూటమి పార్టీలు కాదన్న సంగతి వైస్సార్సీపీ నేతలకు తెలియకపోవడం విచారకరమన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎమ్‌లతో గెలిచామని, నేడు బ్యాలెట్ పేపర్లతో కూడా 2024కు మించి ఘన విజయం సాధించామని, ఇదంతా ప్రజల ఆశీస్సులేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ నేతలు దూరంగా పారిపోయారని, కొందరు తప్పులు తడకలుగా నామినేషన్లు వేసి ఎన్నికల నుంచి తప్పించుకుని, ఆ బుర దంతా కూటమి పార్టీల నేతలపై చల్లుతున్నారని ఆయనన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి పాలనను కోరుకుంటున్నారని, కూటమి పాలనతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఓటు రూపంలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా నాటకాలు కట్టిపెట్టాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఈనెల 26 నుంచి.. పంచాయతీ ఎన్నికలు

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. నవంబరు 26, 29, డిసెంబరు 2 తేదీల్లో మూడు విడతల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఆమేరకు ఎన్నికల ఏర్పాట్లకు సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు ఎన్నికల గుర్తులు కేటాయించడం కూడా జరిగింది. దీంతో గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సందడి నెలకొంది.

త్వరలోనే సహకార ఎన్నికలు

రాష్ట్రంలో త్వరలోనే సహకార సంఘాల ఎన్నికలు కూడా జరుగనున్నాయి. పురపాలక సంఘాలకు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు ఎన్నికలు పూర్తయి, గ్రామపంచాయతీలయ ఎన్నికలకు తెరతీస్తున్న నేపథ్యంలో, ఆ తర్వాత సహకార సంఘాల ఎన్నికలకు కూడా ప్రభుత్వం సమాయత్తమవుతోంది. 2013లో పాలకవర్గాలు ఎన్నికై 2018లోనే ముగిసినా, ఈ సంఘాలకు అప్పటినుంచి ఎన్నికలు నిర్వహించనే లేదు. ప్రభుత్వాధికారులే వాటిని ఎలాగో నెట్టుకొస్తున్నారు. దాదాపు ఎనిమిదేళ్లు గడిచినా ఎన్నికలు లేకపోవడాన్ని దృష్టిలో పెట్టుకుని ఇకనైనా సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించినట్లు తెలుస్తోంది. బహుశా జనవరిలో ఈ ఎన్నికలుంటాయని భావిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)ల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయలంటూ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని జిల్లా సహకార శాఖ అధికారులకు సూచించింది కూడా. రాష్ట్ర సహకార కమిషనర్ ఏ.బాబు అమేరకు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఎన్నికలకు అవసరమైన క్షేత్రస్థాయి కార్యక్రమాలన్నీ ముందుగానే పూర్తిచేయాలని, సిబ్బందికి ఎన్నికలకు సంబంధించిన చట్టపరమైన విషయాల పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 82 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండడంతో, ఆయా సంఘాలకి సంబంధించిన ఓటర్ల జాబితాను తయారుచేయాలంటూ జిల్లా అధికారులకి ఆదేశాలు కూడా వచ్చాయి.

నెల్లూరు కార్పొరేషన్‌లో కొలువు దీరనున్న

37 మంది మహిళా "మణులు"

ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు గణనీయమైన సంఖ్యలో విజయం సాధించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ఆసక్తికరమైన పరిణామం. ముఖ్యంగా నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే మహిళా సాధికారతకు అద్దం పట్టేలా కనిపిస్తున్నాయి. నగర రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం కొత్త మలుపు తిరగబోతోందనడానికి ఈ ఫలితాలే నిదర్శనం.

నెల్లూరు నగరపాలక సంస్థలో మొత్తం 72 డివిజన్లు ఉన్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి 69 స్థానాలను కైవసం చేసుకుని ఘనవిజయం సాధించగా, మిగిలిన మూడు స్థానాల్లో ఒకటి వైసీపీకి, మరో రెండు స్వతంత్ర అభ్యర్థులకు దక్కాయి. ఈ ఎన్నికల్లో రాజకీయపార్టీల విజయాలు, పరాజయాల కంటే ప్రత్యేకంగా చర్చించుకోవాల్సిన అంశం మహిళా అభ్యర్థుల విజయాల సంఖ్య. మొత్తం 72 స్థానాలకు గాను ఏకంగా 37 మంది మహిళలు విజయం సాధించారు. అంటే నగర కార్పొరేషన్‌లో సగానికి మించి మహిళా ప్రజాప్రతినిధులు నవంబర్ 23 తరువాత కొలువుదీరనున్నారు. ఇది సాధారణ విషయం కాదు. నగర రాజకీయాల్లో మహిళలు కేవలం రిజర్వేషన్ల కారణంగా మాత్రమేకాకుండా, ప్రజల ఆదరణతోనూ తమ ఉనికిని చాటుకుంటున్నారనే సంకేతంగా దీన్ని చూడాలి. ఎన్నికల బరిలో పురుషులతో సమానంగా పోటీపడి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం మహిళల రాజకీయ చైతన్యానికి నిదర్శనం.

ప్రాతినిధ్యం మాత్రమే కాదు.. పాలనా బాధ్యత కూడా!

అయితే మహిళలు పెద్ద సంఖ్యలో ఎన్నిక కావడం ఒక విజయమైతే, ఆ విజయాన్ని సమర్థవంతమైన పాలనగా మార్చడం అసలైన సవాలు. ఎన్నికైన మహిళా కార్పొరేటర్లు తమ డివిజన్ల సమస్యలపై నిరంతరం దృష్టి సారించాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. రాజకీయ పార్టీలకు అతీతంగా నగర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధుల విషయంలో మరో అంశాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. ఎన్నికైన మహిళల స్థానంలో వారి కుటుంబ సభ్యులు లేదా ఇతరులు పెత్తనం చెలాయించే పరిస్థితులు రాకూడదు. ప్రజలు ఎన్నుకున్నది మహిళా ప్రతినిధిని కాబట్టి, నిర్ణయాలు తీసుకోవడంలోనూ, ప్రజా సమస్యలపై స్పందించడంలోనూ ఆమెకే పూర్తి స్వేచ్ఛ, స్వతంత్రత ఉండాలి. అప్పుడే మహిళా సాధికారతకు నిజమైన అర్థం చేకూరుతుంది.

నెల్లూరు నగర అభివృద్ధిలో మహిళల ముద్ర పడాలి!

నెల్లూరు నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో నగరపాలక సంస్థపై ఎన్నో బాధ్యతలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పన నుంచి పారిశుధ్యం వరకు, ట్రాఫిక్ సమస్యల నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు అనేక సవాళ్లు ఎదురు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో 37 మంది మహిళా కార్పొరేటర్లు ఒక బృందంగా సమన్వయంతో పనిచేస్తే నగర పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్ట వచ్చనడంలో సందేహం అవసరం లేదు. నిజానికి మహిళలు ఇంటి నిర్వహణలో చూపే బాధ్యత, సమన్వయం, ఓర్పు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం ప్రజా పాలనలోనూ ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ లక్షణాలు మహిళలకే పరిమితమైనవి కావు. సమాన అవకాశాలు, సరైన ప్రోత్సాహం, స్వతంత్రంగా పనిచేసే వాతావరణం కల్పిస్తే వారు తమ సామర్థ్యాన్ని మరింత సమర్థంగా నిరూపించుకోగలరు.

మహిళల విజయమే నగర ప్రగతికి పునాది కావాలి!

నెల్లూరు నగరపాలక సంస్థలో 72 మంది కార్పొరేటర్లలో 37 మంది మహిళలు ఉండటం ఒక విశేషం మాత్రమే కాదు.. భవిష్యత్తు రాజకీయాలకు ఒక ఆశాజనక సంకేతం. మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు నాయకత్వ బాధ్యతలను చేపట్టి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోగలరని ఈ ఫలితాలు చాటుతున్నాయి. అయితే ఈ 50 శాతానికి పైబడిన మహిళా ప్రాతినిధ్యం కేవలం సంఖ్యలకే పరిమితం కాకూడదు. అది నగరాభివృద్ధిలో, పారదర్శక పాలనలో, ప్రజా సమస్యల పరిష్కారంలో కనిపించాలి. మహిళా కార్పొరేటర్లు తమ పనితీరుతో ఆదర్శంగా నిలిస్తే రాబోయే తరాల మహిళలకు రాజకీయాల్లోకి రావడానికి మరింత ప్రేరణ లభిస్తుంది. అధిక శాతం మహిళలు గెలవడం ఒక విశేషమైతే, వారు పాలనలో తమదైన ముద్ర వేయడం అసలైన విజయం. నెల్లూరు నగర కార్పొరేషన్‌లో కొలువుదీరనున్న ఈ 37 మంది మహిళా "మణులు" నగరాభివృద్ధికి కొత్త వెలుగులు ప్రకాశింప చేస్తారని ఆశిద్దాం!


ఎం.మధుపావని
డివిజన్ 3


ఎం.నాగమణి
డివిజన్ 4


ఎస్.లక్ష్మి
డివిజన్ 7


కె.కోటేశ్వరి
డివిజన్ 10


కె.గీతిక
డివిజన్ 11


ఎన్.కామాక్షి
డివిజన్ 13


జి.కెజియా
డివిజన్ 15


కె.కళ్యాణి
డివిజన్ 16


జి.లక్ష్మి
డివిజన్ 18


జి.విజయలక్ష్మి
డివిజన్ 21


యు.చందుప్రియ
డివిజన్ 24


ఎస్.గాయత్రి
డివిజన్ 26


ఏ.శాంతి
డివిజన్ 33


బి.చాముండేశ్వరి
డివిజన్ 34


బి.సుప్రజ
డివిజన్ 36


ఎం.నీలిమ
డివిజన్ 38


ఏ.మల్లీశ్వరి
డివిజన్ 39


పి.అపర్ణ
డివిజన్ 41


ఎం.కామాక్షి
డివిజన్ 42


ఎం.శోభ
డివిజన్ 43


బి.వేదశ్రీ
డివిజన్ 44


షేక్ హబీబున్నీసా
డివిజన్ 48


ఎన్.శైలజ
డివిజన్ 50


బి.భువనేశ్వరి
డివిజన్ 51


పి.విష్ణుప్రియ
డివిజన్ 52


కె.నవ్యలక్ష్మి
డివిజన్ 53


ఏ.సమత
డివిజన్ 54


జి.విశాలాక్షి
డివిజన్ 55


ఎన్.శ్రీదివ్య
డివిజన్ 56


షేక్ షబానాబేగం
డివిజన్ 57


షేక్ నజిమ
డివిజన్ 64


కె.రేవతి
డివిజన్ 66


ఎన్.ప్రసన్నకుమారి
డివిజన్ 67


ఎం.శిరీష
డివిజన్ 68


షేక్ షహీన
డివిజన్ 69


షేక్ ఆలియా
డివిజన్ 71


షేక్ సల్మా
డివిజన్ 72

'జనగణన'ను పటిష్టంగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలో జనగణన సర్వేని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. ఈనెల 10న నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జిల్లా సెన్సెస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, మదనపు ఛార్జ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనాభా గణన-2027 పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఇంటింటి సర్వే, రివిజనల్ రౌండ్‌లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలన్నారు. 2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌లో వివరాల నమోదు, 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి ఎన్యుమరేషన్ ప్రక్రియలను ఎటువంటి లోటు పాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. డిఆర్ఓ విజయ్ కుమార్, అదనపు కమిషనర్ హిమబిందు, సిపిఓ లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.

దివ్యంగా దీపావళి

దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పండుగ ఆదివారం రావడంతో ఇంటిపట్టున ఉండేవారంతా దీపాలు వెలిగించి, పిల్లాపాపలతో బాణసంచా వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీ మహాలక్ష్మీదేవికి పూజలు చేసి, ఇంటింటా దీపాలు వెలిగించారు. వాడవాడలా బాణసంచా మోతలతో నగరం దద్దరిల్లింది. టపాసుల వ్యాపారాలు బాగా జరిగాయి. ధరలు మోత మోగాయి.

నెల్లూరు కబుర్లు

మంత్రి నారాయణకు.. టీడీపీ నాయకుల కృతజ్ఞతలు



మంత్రి నారాయణని గజమాలతో సత్కరిస్తున్న 10వ డివిజన్ టీడీపీ నాయకులు

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో 10వ డివిజన్‌లో టీడీపీకి 2888 ఓట్ల భారీ మెజారిటీ సాధించిపెట్టిన ప్రజలకు, అందుకు కృషి చేసిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణకు డివిజన్ టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. చింతారెడ్డిపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇటీవల మంత్రి నారాయణను కలిసిన కార్పొరేటర్ కుటుంబసభ్యులు కిన్నెర ప్రసాద్, కిన్నెర ప్రేమ్, టీడీపీ నాయకులు గజమాలతో మంత్రిని ఘనంగా సత్కరించారు. 17వ డివిజన్‌లో 2842 ఓట్ల మెజారిటీ సాధించిన కార్పొరేటర్ కాకర్ల తిరుమలనాయుడు డివిజన్ వాసులతో కలిసి వచ్చి, మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిన్నెర ప్రసాద్ మాట్లాడుతూ, నెల్లూరు నగర ప్రజలంతా మంత్రి నారాయణ వెంటే ఉన్నారని పురపాలక ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయని తెలిపారు. తమ విజయానికి సహకరించిన మంత్రి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో కూడా సైనికుల్లా పనిచేసి మంత్రి రుణం తీర్చుకుంటామన్నారు.

రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..ఆకాశదీపం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, ఆల్తూరు సులోచనమ్మ

కార్తీకమాసం సందర్భంగా నెల్లూరు రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలోని శ్రీ సుందరేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈనెల 9న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, ఉభయకర్తలు ఆల్తూరు సులోచనమ్మ పాల్గొని, స్వామివారి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తుల సమక్షంలో ఆకాశదీపోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్‌పర్సన్ ఏలూరు శిరీష, ఆలయ ఇఓ శ్రీధర్‌నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఖోఖోలో..డీకెడబ్ల్యు ఫస్ట్

ఇటీవల విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కావలిలోని జేబీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో నెల్లూరు డీకేడబ్ల్యు కళాశాల జట్టు అన్నిక్రీడాంశాల్లో విజేతగా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి తెలిపారు. విజేతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ సౌమ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో.. కిలో 35కే ఎర్రగడ్డలు



ఎర్రగడ్డలని పంపిణీ చేస్తున్న జేసీ

ఎర్రగడ్డల ధరలు బాగా పెరిగిపోతుండడంతో, ప్రజలకు అందుబాటు ధరల్లో ఉండేలా ప్రభుత్వం రైతుబజార్లలో తగ్గు ధరలకే వాటిని విక్రయిస్తోంది. నెల్లూరులోని ఫతేఖాన్‌పేట రైతు బజార్‌లో ఏర్పాటుచేసిన ఎర్రగడ్డల విక్రయకేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఈ నెల 9న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా ఎర్రగడ్డలు కిలో 35 రూపాయలకే ఇక్కడ విక్రయించే ఏర్పాట్లు చేశామని, గుర్తింపు కార్డు ఆధారంగా ఒక్కొక్కరికి రెండు కిలోల ఎరగడ్డలు ఇస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ధరల నియంత్రణకు చర్యలు

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 10న ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను ఈ నెల 13వతేదీలోగా ఫుడ్‌స్టాక్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం నిల్వల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. నిల్వలను దాచిపెట్టడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నెల్లూరు అభివృద్ధికి సహకారం అందిస్తా

- మంత్రి ఆనం భరోసా -



మంత్రి ఆనంకి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు మేయర్‌గా విజయం సాధించిన కూటమి అభ్యర్థి రూప్ కుమార్‌యాదవ్ తొలిసారిగా ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. రూప్‌కుమార్‌తో పాటు వివిధ డివిజన్లలో విజయం సాధించిన కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా మంత్రిని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మీ సహకారం, సలహాలు, సూచనలు అవసరమని వారు మంత్రి ఆనంని కోరారు. ఈ సందర్భంగా మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌తో పాటు విజయం సాధించిన కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులందరికీ మంత్రి ఆనం శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకత్వానికి ప్రజలు అందించిన ఈ విజయాన్ని బాధ్యతగా భావించి, నెల్లూరు నగర అభివృద్ధి కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని అందుకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. 61వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, అల్లంపాటి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్య, వసతి, వికాసం'కి.. 10 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఎస్ఎన్‌జే గ్రూప్ చైర్మెన్ జయమురుగన్

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, విద్యా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించిన "విద్య,వసతి, వికాసం" కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇటీవల ఎస్ఎన్‌జే గ్రూప్ ఛైర్మెన్ జయమురుగన్ రూ. 10 లక్షల విరాళం ఇస్తూ, ఆ చెక్కును జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతకు కృతజ్ఞతలు తెలుపుతూ, పేద విద్యార్థుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. విరాళాలు అందించదలచిన వారు జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మిని లేదా dbcweo.nlr.18@gmail.com, cpo_nlr@yahoo.co.in ఈ-మెయిల్‌లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి దారుణం



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీయుడబ్ల్యుజె నాయకులు

కావలిలో ఒక దినపత్రికలో పనిచేస్తున్న ప్రముఖ పాత్రికేయుడు సుబ్బారావుపై ఇటీవల కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి గాయపరచడం దారుణమని ఎపీయుడబ్ల్యుజె నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విలేకరి ప్రస్తుతం కావలిలో చికిత్స పొందుతున్నారని, ఆయనపై దాడి చేసినవారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీయుడబ్ల్యుజె నాయకులు ఇటీవల నెల్లూరులో జిల్లా జాయింట్ కలెక్టర్‌ని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘం నాయకులు ఏ.జయప్రకాష్, వల్లూరు వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమేష్, కోశాధికారి హనూక్, ఉపాధ్యక్షులు దయాశంకర్, నరసింహులు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ పరీక్ష ఫీజులు కట్టండి

రాష్ట్రలో పదో తరగతి పరీక్షలకు చెల్లించాల్సిన పరీక్ష ఫీజులను ఈనెల 25లోగా కట్టాలని, ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్ నుంచి చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.బాలాజీరావు ఈనెల 9న ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం (రూ.50)తో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ. 200 అపరాధ రుసుంతో డిసెంబరు 9 వరకు, 5 వందల రూపాయల అపరాధ రుసుంతో డిసెంబరు 15వ తేదీ వరకు పరీక్ష ఫీజులు చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు గడువులోగా పరీక్షా ఫీజులు చెల్లించాలని ఆయన కోరారు.

నెల్లూరు రూరల్‌లో..
నూటికి నూరుశాతం టీడీపీ స్ట్రైక్‌రేట్

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో గతంలో ఎన్నడూ చూడని విధంగా కూటమి చరిత్రాత్మక విజయాన్ని కైవసం చేసుకుందని, కార్పొరేషన్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సైతం టీడీపీ నూటికి నూరుశాతం స్ట్రైక్‌రేట్‌ను సాధించిందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు.

ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో మాట్లాడుతూ, కూటమి చేస్తున్న అభివృద్ధికి స్థానిక ఎన్నికల్లోని విజయాలే నిదర్శనమన్నారు. అపూర్వ గెలుపును అందించిన ప్రజలకు చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. జడ్పీటీసీతో పాటు, 12 ఎంపీటీసీ స్థానాల్లోనూ టీడీపీకి ప్రజలు విజయం సాధించిపెట్టారని ఆయన అంటూ, గత శాసనసభ ఎన్నికల్లో తనకిచ్చిన ఓట్లకంటే, కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు రూరల్ ప్రజలు ఘనవిజయం చేకూర్చారని సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ప్రజల ఆశీస్సులతో వచ్చిన ఆ విజయాన్ని చూసి పొంగిపోకుండా, ఒళ్లు దగ్గర పెట్టుకుని బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. వైసీపీ నుంచి పోటీచేసి ఓడిపోయినవారు కొంతమంది టీడీపీలోకి వస్తామని, తనతో నేరుగా ఫోన్ చేశారని చెప్పారు. అయితే, స్థానికంగా కొన్ని సమస్యలున్నాయని, అందరితో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అందరం కలసి నియోజకవర్గం అభివృద్ధికి కృషిచేద్దామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందుతోందన్నారు. ఎన్నికల్లో విజయం కోసం కష్టం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి

విజేతలకి వేమిరెడ్డి దంపతుల దిశానిర్దేశం

పదవులను బాధ్యతగా భావించి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు నియోజకవర్గంలో విజేతలైన కూటమి అభ్యర్థులకి స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గెలిచిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లతో నెల్లూరులోని తమ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి మరింత విస్తృతంగా



విజేతలతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకూరుపేట జడ్పీటీసీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విడవలూరు బిట్-1 ఎంపీటీసీ చెముకుల చైతన్య, ఇందుకూరుపేట 2-1 స్వతంత్ర అభ్యర్థి వెంకటలక్ష్మి, 2-2 స్వతంత్ర అభ్యర్థి భీమవరపు వెంకట కృష్ణారెడ్డి తదితరులు వీపీఆర్ దంపతులను కలిసినవారిలో ఉన్నారు.

అరాచకంపై.. అభివృద్ధి విజయం - ప్రశాంతమ్మ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు చరిత్రలోనే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించారని, గతంలో ఈవీఎంలపై నిందలేసిన వారికి బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు గట్టి సమాధానమిచ్చారని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కోవూరు నియోజకవర్గంలోని 78 ఎంపీటీసీ స్థానాల్లో 70 స్థానాలతో పాటు, మరో రెండు భారీమెజారిటీలతో కూటమి ఖాతాలో చేరాయని ప్రశాంతమ్మ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలోనూ 28 వార్డులకు 23 కూటమి అభ్యర్థులే గెలిచారని చెప్పారు. ఇటీవల ఆమె కోవూరు నియోజకవర్గంలో ఎన్నికైన కూటమి విజేతలతో నెల్లూరులోని విపిఆర్ కార్యాలయంలో మాట్లాడారు. ఇది ఐదేళ్ల అరాచక పాలనపై రెండున్నరేళ్ల అభివృద్ధి, సంక్షేమం సాధించిన విజయమన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, కోవూరులో 11,590 ఓట్లు, విడవలూరులో 8,450 ఓట్ల మెజారిటీతో కూటమి అభ్యర్థులు గెలిచారని తెలిపారు. ఎంపీటీసీ స్థానాల్లో కోవూరులో 22కి 21, ఇందుకూరుపేటలో 17కి 15, విడవలూరులో 14కి 13, కొడవలూరులో 14కి 12, బుచ్చిరెడ్డిపాళెంలో 11కి 9 స్థానాలను గెలుచుకున్నామని, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దొడ్ల విజయలక్ష్మి 8 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారన్నారు.



జననం: 21.08.1930 నిర్యాణం: 19.11.2019

7వ వర్ధంతి

మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం

శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు

(లేట్. శ్రీ చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి, మనుబోలు)

మాకు దూరమై నవంబర్ 19, 2026 నాటికి
ఏడేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని సంస్మరించుకుంటూ..

ఆమె దివ్య ఆత్మకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై

మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై

మనుమరాలు - మనుమడు
శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ

మునిమనుమలు, మునిమనుమరాండ్రు
జయేష్ & అష్మిత ఆకాష్
కీర్తన లక్ష్మి & తనవ్

విద్యార్థి సంఘాలు: నాయకత్వాన్ని పెంచే సృజనాత్మక వేదికలు

పాఠశాల లేదా కళాశాల విద్య అనేది కేవలం పుస్తకాలలోని పాఠాలను నేర్చుకోవడం మాత్రమే కాదు. జీవితాన్ని అర్థం చేసుకోవడం, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడం, నాయకత్వాన్ని అలవర్చుకోవడం, సమిష్టిగా పనిచేయడం కూడా విద్యలో భాగమే. తరగతి గదిలో సూత్రాలు నేర్చుకోవచ్చు, కానీ వాటిని ఆచరణలో పెట్టే అవకాశాలు తరచుగా విద్యార్థి సంఘాల ద్వారా లభిస్తాయి. అందుకే ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలు విద్యార్థి సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తాయి. ఒక సంఘం అనేది కేవలం కొన్ని సమావేశాల సమూహం కాదు; అది ఆలోచనలకు రూపం ఇచ్చే వేదిక, నాయకత్వానికి పునాది, భవిష్యత్తు అవకాశాలకు తొలి మెట్టు. విద్యార్థి సంఘం అంటే ఒకే అభిరుచి, ఒకే లక్ష్యం, లేదా ఒకే ఆసక్తి కలిగిన విద్యార్థులు కలిసి ఏర్పరచుకునే వేదిక. అది సాహిత్య సంఘం కావచ్చు, విజ్ఞాన సంఘం కావచ్చు, పర్యావరణ పరిరక్షణ వేదిక కావచ్చు, సేవా సంస్థ కావచ్చు, సాంకేతిక విజ్ఞాన వేదిక కావచ్చు, లేదా కళా సంస్కృతి క్లబ్ కావచ్చు. ఒక ఆలోచన చుట్టూ కూడిన చిన్న బృందం, సరైన దిశలో కృషి చేస్తే, విద్యాసంస్థ మొత్తంపై సానుకూల ప్రభావం చూపగలదు. చాలామంది విద్యార్థులు నాయకత్వం అనేది కొందరికే సాధ్యమని భావిస్తారు. అయితే నిజానికి నాయకత్వం పదవిలో ఉండటం వల్ల రాదు; బాధ్యతను స్వీకరించడం వల్ల వస్తుంది. ఒక విద్యార్థి సంఘాన్ని ప్రారంభించడం ద్వారా విద్యార్థులు ప్రణాళిక రచన, సమయపాలన, సమన్వయం, సంభాషణ, నిర్ణయ సామర్థ్యం వంటి జీవిత నైపుణ్యాలను సహజంగానే నేర్చుకుంటారు. ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయడం, సభ్యులను కలుపుకోవడం, కార్యక్రమాలను నిర్వహించడం వంటి చిన్న ప్రయత్నాలే తరువాత గొప్ప నాయకత్వానికి పునాదులు అవుతాయి.మన దేశంలోనూ, విదేశాల్లోనూ ఉన్న అనేక విజయవంతమైన వ్యక్తుల ప్రయాణాలను పరిశీలిస్తే, వారు విద్యార్థి దశలోనే ఏదో ఒక సంఘంలో చురుకుగా పాల్గొన్నట్లు కనిపిస్తుంది. ఆ అనుభవాలు వారికి ప్రజలతో మమేకం కావడం, బృందాన్ని నడిపించడం, ఒత్తిడిలో పనిచేయడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను అందించాయి.

ఒక మంచి విద్యార్థి సంఘం పుట్టుక సాధారణంగా ఒక ప్రశ్నతో ప్రారంభమవుతుంది. ఉదాహరణకు, పుస్తకాలు చదవడం ఇష్టపడే కొంతమంది విద్యార్థులు కలిసి ఒక పఠన వేదికను ప్రారంభించవచ్చు. పర్యావరణంపై ఆసక్తి కలిగినవారు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టవచ్చు. సాంకేతిక విద్యపై ఆసక్తి ఉన్నవారు కొత్త ఆవిష్కరణలను చర్చించే వేదికను ప్రారంభించవచ్చు. ప్రారంభం చిన్నదైనా ప్రభావం పెద్దదిగా ఉండొచ్చు.విద్యార్థి సంఘం విజయవంతం కావాలంటే దాని వెనుక స్పష్టమైన లక్ష్యం ఉండాలి. సభ్యులు ఎందుకు కలుస్తున్నారు? వారు ఏమి సాధించాలని కోరుకుంటున్నారు? వారి కార్యకలాపాలు సమాజానికి లేదా విద్యాసంస్థకు ఎలా ఉపయోగపడతాయి? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి.



సంఘం విజయానికి సభ్యుల పాత్ర కూడా అత్యంత కీలకం. ఒకరు మాత్రమే పనిచేసే వేదిక ఎక్కువ కాలం నిలవదు. ప్రతి సభ్యుడు బాధ్యతను పంచుకోవాలి. ఒకరు కార్యక్రమం నిర్వహిస్తే, మరొకరు ప్రచారం చేయవచ్చు. ఒకరు సభ్యులను సమీకరిస్తే, ఇంకొకరు ఆర్థిక వ్యవహారాలను చూడవచ్చు. ఈ విధంగా సమిష్టి కృషి ద్వారా బృంద స్ఫూర్తి పెరుగుతుంది. వాస్తవానికి, విద్యార్థి సంఘాలు మనకు "నేను" అనే ఆలోచన నుండి "మనం" అనే ఆలోచన వైపు తీసుకెళ్తాయి. విద్యార్థి సంఘాల ద్వారా కమ్యూనికేషన్ నైపుణ్యాలు కూడా గణనీయంగా పెరుగుతాయి. సభ్యులతో మాట్లాడడం, కార్యక్రమాలను వివరించడం, అతిథులను ఆహ్వానించడం, సమావేశాలను నిర్వహించడం వంటి పనులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. తరగతి గదిలో మాట్లాడటానికి సంకోచించే విద్యార్థి, ఒక సంఘం ద్వారా వందలమంది ముందు మాట్లాడగల స్థాయికి ఎదగడం అసాధారణ విషయం కాదు. విద్యార్థి సంఘాలు సామాజిక బాధ్యతను కూడా పెంచుతాయి. అనాథాశ్రమాల సందర్శనలు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ కార్యక్రమాలు, గ్రామీణ సేవా కార్యక్రమాలు, పుస్తకాల సేకరణ కార్యక్రమాలు వంటి కార్యాచరణల ద్వారా విద్యార్థులు సమాజంలోని వాస్తవ సమస్యలను అర్థం చేసుకుంటారు. పుస్తకాలలో చదివే విలువలు ఆచరణలోకి వస్తాయి. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి ఇవి అద్భుతమైన అవకాశాలు.

ప్రస్తుత కాలంలో అనేక సంఘాలు సాంకేతికతను కూడా సమర్థవంతంగా ఉపయోగిస్తున్నాయి. ఆన్‌లైన్ సమావేశాలు, జ్ఞాన వినిమయ కార్యక్రమాలు, నిపుణులతో సంభాషణలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం వంటి అంశాలు విద్యార్థి సంఘాల పరిధిని విస్తరించాయి. ఒక చిన్న కళాశాల సంఘం కూడా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులతో అనుసంధానం కావచ్చు. ఇది విద్యార్థులకు విస్తృత దృక్పథాన్ని అందిస్తుంది. విద్యార్థి సంఘాలు కేవలం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాదు, వృత్తిపరమైన జీవితానికి కూడా గొప్ప పునాది వేస్తాయి. ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో, నాయకత్వ అనుభవం, బృందం పని, కార్యక్రమాల నిర్వహణ వంటి అనుభవాలు విద్యార్థులను ప్రత్యేకంగా నిలబెడతాయి. మన భారతీయ సంప్రదాయంలో కూడా సంఘ జీవనానికి గొప్ప ప్రాధాన్యం ఉంది. గురుకుల వ్యవస్థలో విద్యార్థులు కలిసి నేర్చుకునేవారు, కలిసి సేవ చేసేవారు, కలిసి సమస్యలను పరిష్కరించేవారు. నేటి విద్యార్థి సంఘాలు కూడా అదే విలువలను ఆధునిక రూపంలో కొనసాగిస్తున్నాయి. అవి యువతలో సహకారం, సేవాభావం, నాయకత్వం, సృజనాత్మకత వంటి విలువలను పెంపొందిస్తున్నాయి. చివరగా, ఒక విద్యార్థి సంఘం అనేది కేవలం ఒక క్లబ్ కాదు; అది ఒక అవకాశం. అది స్నేహాలను నిర్మించే వేదిక. అది ఆలోచనలను రూపుదిద్దే ప్రయోగశాల. అది నాయకత్వాన్ని పెంచే పాఠశాల. అది సమాజ సేవకు ద్వారం. ఒక చిన్న ఆలోచనతో ప్రారంభమైన సంఘం, అనేక మంది జీవితాలను ప్రభావితం చేయగల శక్తిగా మారవచ్చు. అందుకే ప్రతి విద్యార్థి తన అభిరుచి, తన లక్ష్యం, తన విలువలకు అనుగుణంగా ఒక సంఘంలో పాల్గొనడానికి లేదా ఒక కొత్త సంఘాన్ని ప్రారంభించడానికి ముందుకు రావాలి.



వచ్చే వారం : యువ పారిశ్రామికత : స్వప్నాలను సాకారం చేసే సాహసయాత్ర

E-mail: reddyu@gmail.com

ఉదయగిరిలో విజయభేరీ

• కాకర్ల వ్యూహమే గెలుపుకు మలుపు



స్థానిక ఎన్నికల్లో దాదాపు రెండున్నర దశబ్దాల తర్వాత ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయభేరీ మోగించింది. తొలి నుంచి ప్రజాసేవా భావం ఉన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో గత కొద్దికాలంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. 8 మండలాలున్న ఉదయగిరి నియోజకవర్గంలో పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన ఎమ్మెల్యే శ్రమ ఎట్టకేలకు ఫలించి ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు తెచ్చిపెట్టింది. ప్రజలు టీడీపీని ఆశీర్వదించారు. గత పాతిక సంవత్సరాలుగా ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురంలో స్థానిక ఎన్నికల్లో గెలవని తెలుగుదేశంపార్టీ ఈ ఎన్నికల్లో విజయపతాకాన్ని ఎగుర వేసింది. నియోజకవర్గంలో అత్యధికంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను తెదేపా గెలుచుకోవడంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వ్యూహాత్మక కృషి ఎంతైనా ఉంది. అదే టీడీపీ గెలుపుకు మలుపుగా మారింది. మొత్తం 8 మండలాల్లో 83 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. వాటిలో 62.ఎంపీటీసీ, 7 జడ్పీటీసీ స్థానాలను కూటమి గెలుచుకొని స్థానిక ఎన్నికల్లో తన సత్తా చాటడం విశేషం.

విజేతలని అభినందించిన కాకర్ల



ఉదయగిరి నియోజక వర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈనెల 8న వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. విజేతలందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని, బాధ్యతను గుర్తుంచుకుని గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆయన విజేతలకు సూచించారు.

గెలిచిన కూటమి..

వైసీపీకి ఓటమి

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో వైసీపీకి దిమ్మతిరిగే విజయాలు కూటమికి లభించాయి. జడ్పీటీసీ ఎన్నికల్లో కేవలం రెండంటే రెండు స్థానాలు మాత్రమే వైసీపీకి దక్కాయంటే జిల్లాలో టీడీపీ ప్రభంజనం ఏ స్థాయిలో ఉందోఊహించుకోవచ్చు. జిల్లాలో మొత్తం 35 జడ్పీటీసీ స్థానాలుంటే, అందులో 2 మాత్రమే వైసీపీకి రావడంతో ఆ పార్టీవర్గాలు కంగుతిన్నాయి. అదేవిధంగా జిల్లాలోని మొత్తం 440 ఎంపీటీసీ స్థానాలలో 73 కూటమికి ఏకగ్రీవం కాగా, 272 స్థానాల్లో పోటీ జరిగింది. మొత్తం 440లో 345 స్థానాల్లో కూటమి గెలిచింది. వైసీపీకి ఓటమి మిగిలింది.

స్వల్ప ఓట్లతోనే గెలిచేశారు!

ఎంపీటీసీ ఎన్నికల్లో పలువురు అభ్యర్థులు కేవలం ఒక్క ఓటు, రెండు, మూడు ఓట్ల తేడాతోనే వారు విజయాలు సాధించడం జిల్లాలో సంచలనం కలిగించింది. నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం పైనాపురంలో టీడీపీ అభ్యర్థినిగా పోటీ చేసిన దాసరి కుమారక్క ఒకే ఒక్క ఓటు తేడాతో విజయాన్నికైవసం చేసుకున్నారు. అదేవిధంగా, చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నంలో టీడీపీ అభ్యర్థిని కొండూరు అరుణ, ఆమెకి ప్రత్యర్థిగా వైసీపీ తరఫున బొమ్మి సుజాతమ్మ పోటీచేశారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపును పరిశీలించి రీకౌంటింగ్ చేయగా, అరుణ రెండంటే రెండు ఓట్ల తేడాతో గెలిచారు. ఇకపోతే, గూడూరు మండలం తిప్పవరప్పాడులో టీడీపీ ఎంపీటీసీ సభ్యునిగా పోటీచేసిన డి.రాధాకృష్ణారెడ్డి మూడు ఓట్ల తేడాతోనే విజయం సాధించారు.

జొన్నవాడ దేవాలయానికి..

భారీగా భక్తుల కానుకలు

• 95 రోజుల్లో 53 లక్షలకి పైగానే రాబడి



ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లి కార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవస్థానం హుండీలను ఇటీవల లెక్కించారు. 4.8.2026 నుండి 6.11.2026 వరకు, 95 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 53,68,476లు లభించిందని ఆలయ అధికారులు తెలిపారు. యూఎస్ డాలర్ 11, థాయ్ బాట్ 160, సింగపూర్ డాలర్ 100, మలేసియా రింగిట్ 10, బంగారు వస్తువులు 71 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి వస్తువులు 230 గ్రాములతో పాటు, శ్రీవారి అన్నప్రసాద హుండీ ద్వారా రూ.3,00,487లను భక్తులు సమర్పించారు. ఆలయ సహాయ కమిషనర్ జె. శ్రీనివాసరావు, ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఎన్నికల కోడ్

రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోనూ, ఆ తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో అక్కడంతా ఎన్నికల కోడ్‌ని ఎత్తివేస్తున్నామని ఈనెల 8న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల ఎన్నిక ప్రక్రియ కొనసాగుతున్నందువల్ల రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ యథావిధిగా అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఎంపిపీలు, జడ్పీ అధ్యక్షుల..పరోక్ష ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రంలోని ఎంపీపీలు, జడ్పీ అధ్యక్షుల పరోక్ష ఎన్నికల నిర్వహణకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆమేరకు ఈనెల 19న రాష్ట్రంలోని 659 మండల పరిషత్‌లలో ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులకి, ఈనెల 20న రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లలో ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. తొలుత ఎంపీపీలలో ఒక్కొక్కరు, జడ్పీలలో ఇద్దరు వంతున కోఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారని భావిస్తున్నారు.

ఈ ప్రజాతీర్పు..


వైసీపీకి కనువిప్పు కావాలి

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ఘోరపరాజయం ఎదురైందని అనవసరంగా నోరు పారేసుకునే వారికి ఈ ప్రజాతీర్పు కనువిప్పు కావాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు అవినీతి, అక్రమాలు, అరాచకాలతో రాజ్యమేలిన వైసీపీ మునిసిపిల్ ఎన్నికల్లో పులివెందుల నుంచి శ్రీకాకుళం వరకు వైసీపీ తుడిచిపెట్టుకు పోయిం దని, జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా అదే తీర్పు పునరావృతమైందని ఆయన చెప్పారు.

ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో మాట్లాడుతూ, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలతో పాటు కూటమికి ఓట్లేసి ఆశీర్వదించిన ప్రజానీకానికి ధన్య వాదాలు తెలిపారు. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అరాచకం సృష్టించారని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు కూటమి పాలనలో అత్యంత పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరిగిందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కూడా టీడీపీ అభ్యర్థులకు ఓట్లు బాగా వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులు, సీఎం చంద్రబాబునాయుడి అనుభవం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారం, యువమంత్రి నారా లోకేష్‌బాబు కృషితో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరుగుతున్నాయని, వాటి ఫలితం స్థానిక సంస్థల ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. రాష్ట్రమంతా కూటమి ఘనవిజయం సాధించడం చాలా సంతోషంగా ఉం దన్నారు. తమ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించిన సర్వేపల్లి ప్రజలకి తామెప్పుడ రుణపడి ఉంటామని ఆయన తెలిపారు.



ఎన్‌బీకేఆర్ అధ్యాపకురాలు

సుజిలతకి డాక్టరేట్

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కుమారి సుజిలతకి ఇటీవల డాక్టరేట్ లభించింది. చెన్నైలోని వెల్ టెక్ రంగరాజన్ డా. సగుంతల ఆర్ అండ్ డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం వారు ఆమెకి డాక్టరేట్‌ని ప్రదానం చేశారు. "దృఢమైన నీటి అడుగున వస్తువుల గుర్తింపు మరియు వర్గీకరణ కోసం తెలివైన ఐఓటీ ఆధారిత డీప్ హైబ్రిడ్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్" అనే అంశం మీద, చెన్నైలోని డాక్టర్ వి.జీవనంతం ఆధ్వ ర్యంలో ఆమె పరిశోధనా పత్రాన్ని సమర్పిం చినట్లు సుజిలత తెలిపారు. ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థలలో పనిచేస్తూ డాక్టరేట్ పొంద డానికి ఎంతో సహాయ సహకారాలు అం దించిన కళాశాల కరస్పాండెంట్ నేదురు మల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆమె ధన్యవా దాలు తెలిపారు. డాక్టరేట్ పొందిన సుజిలతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు, విభాగాధిపతి డాక్టర్ ఏ.రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

నైతిక విజయం మాదే!

○ వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



విజేతలని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గంలో నాలుగు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారని, ఈ ఎన్నికల్లో నైతిక విజయం వైసీపీదేనని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ కార్యకర్తలు భయపడకుండా ఎన్నికల బరిలో నిలిచి గెలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ సభ్యులను ఆయన ఇటీవల వెంకటగిరిలోని తమ నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీటీసీ ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి ఎదురైన అనేక అడ్డంకులు, ఒత్తిళ్లు, బెదిరింపులను అధిగమించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారన్నారు. అధికారబలంతో కూటమి నేతలు పోలీసులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై ఒత్తిళ్లు తీసుకురావడం, నామినేషన్లకు ఆటంకాలు కల్పించడం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బయటివ్యక్తులను వెంకటగిరికి తీసుకొచ్చి నామినేషన్ పత్రాలను సేకరించడం, పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడటం జరిగిందని ఆరోపించారు. అయినా తమ కార్యకర్తలు ఎక్కడా వెనక్కి తగ్గకుండా విజయాలు సాధించారని తెలిపారు. విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్తిక్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

మునిసిపల్ ఎన్నికలకి సిద్ధంకండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్

రెండో విడత మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నాయకులు సన్నద్ధం కావాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఇటీవల ఆయన తన క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

సమన్యాయానికే లీగల్ సెల్ అథారిటీ



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు జడ్జి రాజేష్

లీగల్ సెల్ అథారిటీ ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 25 కోట్ల కేసులు పరిష్కారం చేయడం జరిగిందని, ప్రజలందరికీ సమన్యాయం జరగాలనే ఉద్దేశంతో లీగల్ సెల్ యాక్ట్‌ను తీసుకురావడం జరిగిందని గూడూరు జడ్జి రాజేష్ వెల్లడించారు. నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా ఇటీవల గూడూరు పట్టణంలోని కోర్టు హాల్లో ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్, మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. జడ్జి రాజేష్ మాట్లాడుతూ ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినప్పుడు కోర్టులో పిల్ వేయకుండా జడ్జికి ప్రి లిటికేషన్ అప్లికేషన్ ఇస్తే కక్షిదారులను జడ్జి పిలిపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. ఎవరైనా లాయర్‌ని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేకుండా ఉంటే వారికి లాయర్‌ని ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, కక్షిదారులందరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో అడ్వకేట్ పార్వతయ్య, మహబూబ్ బాషా, లాయర్‌లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్నుడికి ఆకాశదీపం



ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న శ్రీకంటి రామమోహనరావు దంపతులు

గూడూరు, రాజావీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఈ నెల 2వ తేదీ రాత్రి దేవస్థాన చైర్మన్ శ్రీకంటి రామమోహనరావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆకాశదీపాన్ని వెలిగించారు. దేవస్థాన పాలక మండల సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అయ్యప్ప దేవస్థానం.. ద్వితీయ వార్షికోత్సవం



గూడూరు, కాశీ లేఅవుట్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానం రెండవ వార్షికోత్సవం ఇటీవల నయనానందకరంగా జరిగింది. పలురకాల పుష్పాలతో దేవస్థానాన్ని అలంకరించి, ఉదయం అయ్యప్పస్వామి వారికి సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, కలశాభిషేకం, ఉపదేవతల హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. కేరళ వాద్యం, తెనాలి బ్యాండు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'స్వామియే శరణమయ్యప్ప' అంటూ అయ్యప్ప మాలధారణ భక్తుల నామోచ్ఛారణలతో పట్టణం మారుమోగింది. మధ్యాహ్నం దేవస్థానం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మహా పుష్పాభిషేకం, మహా పదునేటాంబి, మహా పడిపూజ, పవళింపు సేవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉభయదాతలుగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, చైర్మన్ సురేష్‌కుమార్‌రెడ్డిలు వ్యవహరించారు.



విద్యార్థినులతో దీపావళి జరుపుకుంటున్న శ్యామ్‌యాదవ్ దంపతులు

మినీ గురుకులంలో దీపావళి వేడుకలు

గూడూరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల (మినీ గురుకులం)లో ఈ నెల 8వ తేదీ దీపావళి పండుగను విద్యార్థినులు ఘనంగా జరుపుకున్నారు. శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్) దాతృత్వంతో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌యాదవ్, ఆయన సతీమణి మహేశ్వరి దంప తులు విద్యార్థినులతో కలిసి టపాకాయలు కాల్చి, వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయినులు అంకమ్మ, పద్మావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు తగదు!



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

జర్నలిస్టులపై దాడులు దారుణమని సీపీఐ నాయకులు అన్నారు. గూడూరులోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 2వ తేదీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, సహాయ కార్యదర్శి జి.శశికుమార్, షేక్ జమాలుల్లా మాట్లాడుతూ ఇటీవల కాలంలో పాత్రికేయులపై దాడులు అధికమవుతున్నాయని, కావలి పట్టణంలో ఈనాడు విలేకరి సుబ్బారావుపై దాడి సిగ్గుచేటన్నారు. వెంటనే పోలీసులు దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, వినోద్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌బ్యాగ్‌ల బరువు తగ్గించండి!

పాఠశాలలకు విద్యాశాఖ మార్గదర్శకాలు

చిన్నపిల్లలు స్కూల్‌బ్యాగ్‌లు మోయలేక ఇబ్బందులు పడుతున్నారని, పుస్తకాల బరువుతో వారు నడవలేక పడిపోతున్నారని, స్కూల్‌బ్యాగ్‌ల బరువు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ ఈనెల 11న మార్గదర్శకాలు జారీచేసింది. స్కూల్‌బ్యాగ్ బరువు విద్యార్థి బరువులో 10శాతం మించకూడదని కూడా చెప్పూ, ఆమేరకు స్కూల్‌బ్యాగ్ మానిటరింగ్ కమిటీని వేసి పర్యవేక్షించాలని ఆ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. బాలలకు రెండు వైపులా తగిలించుకునే బ్యాగులను మాత్రమే అనుమతించాలని, ఒకవైపు భుజానికి తగిలించుకునే బ్యాగులు వద్దని వారికి చెప్పాలని సూచించింది. స్కూల్‌బ్యాగ్ బరువుకు సంబంధించిన ప్రత్యేకంగా ఒక రిజిస్టర్‌ని కూడా నిర్వహించాలని ఆదేశించింది. అదేవిధంగా 1, 2 తరగతులు చదువుకుంటున్న చిన్నపిల్లలకు హోమ్‌వర్క్ ఇవ్వొద్దని సూచించింది. 3-5 తరగతుల వారికి వారానికి రెండుగంటలు మించకుండా, 6-8 తరగతుల వారికి రోజుకు గంటపాటు, ఆపై తరగతులవారికి రోజుకు రెండుగంటల హోమ్‌వర్క్ మాత్రమే ఇవ్వాలని సూచించింది.

పుణ్యదంపతులకి
అక్షరాంజలి!



కీ॥శే॥ శ్రీ వల్లూరు నాగభూషణం గారు – కీ॥శే॥ శ్రీమతి వల్లూరు మధుసూదనమ్మ గారు
(విశ్రాంత గెజిటెడ్ తహశీల్దార్ మరియు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గారి మాజీ వ్యక్తిగత కార్యదర్శి)

నాకు ఊహ తెలిసే సరికి మా అక్క మధుసూదనమ్మ గారికి నాగభూషణం మామతో పెళ్లయిపోయింది.
(ఆయన మా అమ్మకి తమ్ముడు, నాకు మేనమామ)
నాకు ఏడేళ్లు వచ్చేసరికి మా నాన్న శ్రీ సిద్దయ్యనాయుడు దైవసాన్నిధ్యం పొందడంతో... నన్నూ, మా అమ్మ శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారినీ, మా అన్న చంద్రశేఖరం గారినీ నాగభూషణం మామ చేరదీశారు.
నన్ను ఉన్నత చదువులు చదివించారు. నాతోపాటు చదువుల నిమిత్తం వచ్చిన పెద్దమ్మ పిన్నమ్మల పిల్లలందరినీ తమ పిల్లలతో సమానంగా చూసేవారు ఆ పుణ్యదంపతులు.
పల్లెలో విద్యా వసతి అంతగా లేని 1960-1970 దశకాల్లో వీరిద్దరూ విద్యాదానం చేసి పుణ్యం మూటకట్టుకోవడం వల్లనే...
ఇప్పుడు వీరి మనుమలు, మనుమరాళ్లు ఇండియాతో పాటు అమెరికా, కెనడా దేశాల్లో స్థిరపడ్డారు.
కష్టాల్లో వున్న వారిని ఆదుకోవడం తన విధ్యుక్త ధర్మంగా భావించేవారు నాగభూషణం మామ.
కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు జమాబందీ సమయంలో సస్పెన్షన్‌కు గురైన కరణంలు, మునసబులు మామ వద్దకు వచ్చేవారు. రెవెన్యూశాఖలో నియమ నిబంధనల మీద పట్టున్న అధికారి కావడంతో వారికి అనుకూలమైన అంశాలను పై అధికారులకు విశదీకరిస్తూ ఫైలు వ్రాసి, వారిని తిరిగి విధుల్లోకి తీసుకొనేలా అధికారులను ఒప్పించేవారు.
గనుల ద్వారా వచ్చే ప్రభుత్వ ఆదాయం పెరగడానికి మార్గాలను సూచించడానికి పెద్దలు వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు పోలుబోయిన రమణయ్య యాదవ్ గారు ఇద్దరూ నాగభూషణమామను కలిసి మాట్లాడుతుండేవారు. ఆ విధంగా నాకు రమణన్నతో పాటు వేమిరెడ్డి శివకోటారెడ్డి గారితో పరిచయం పెరగడం తరువాతి రోజులలో ఆయన నన్ను ఆప్యాయంగా అక్కున చేర్చుకోవడం జరిగింది.
నాగభూషణం మామ గనుల శాఖలో పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచడానికి దోహదం చేసినందుకు ఎస్ఆర్ శంకరన్ వంటి జిల్లా కలెక్టర్ల అభినందనలు అందుకొన్నారు.
మండల పరిపాలన అమల్లోకి వచ్చాక రెవెన్యూ అధికారుల విధులు, బాధ్యతలను క్రోడీకరించి స్వయంగా వ్రాసి "Manual of State Revenue Administration శాసన, నియమ, నిబంధన సంగ్రహము" అనే అమూల్యమైన గ్రంధమును స్వయంగా రచించి, ప్రచురించి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూశాఖలో క్రొత్తగా చేరిన వారికి కూడా విధి నిర్వహణలో ఆ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రాష్ట్ర అధికారుల అభినందనలు అందుకొన్న నాగభూషణం మామ నీతి నిజాయితీలకు మారుపేరు.
అప్పట్లో నిస్వార్థ ప్రజా సేవకులైన కీర్తిశేషులు శ్రీ మాగుంట సుబ్బరామిరెడ్డి గారు, శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు, ఇంకా ప్రస్తుత ఒంగోలు ఎంపీ శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గారి వద్ద మాగుంట ప్రజాసంబంధాల కార్యాలయములో పనిచేస్తూ మాగుంట చారిటీస్ సంస్థల సహకారంతో ఎంతోమంది బడుగు బలహీన వర్గాలు మరియు మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించడంలో వారికి అన్ని విధాలా సహాయపడేవారు.
నవంబర్ 15న దీనజన బాంధవుడు శ్రీ నాగభూషణం మామ వర్ధంతి సందర్భంగా 'మానవ సేవే... మాధవ సేవ' అనే పెద్దల మాటను తమ జీవితాంతం ఆచరించి చూపించిన ఆ పుణ్యదంపతులను స్మరించుకుంటూ... అక్షరాంజలి ఘటిస్తున్నాము.

ఇట్లు : శ్రీమతి & శ్రీ నిడిగంటి గోవర్ధనరావు
విశ్రాంత అధికారి, వాణిజ్య పన్నుల శాఖ, నెల్లూరు
చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ 2025/2026, శక్రమెంటో CA, శంకర నేత్రాలయ, యు.ఎస్.ఏ
బృంద సభ్యులు, తెలుగు సాహిత్య వేదిక, నెల నెలా తెలుగు వెన్నెల, ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం,
TANTEX డల్లాస్ పోర్ట్‌వర్త్, యు.ఎస్.ఏ

నెల్లూరు నక్షత్రం

(మొదటిపేజీ తరువాయి)

కేవలం 15 ఏళ్ల వయసులోనే భవిష్యత్తులో తాను హీరో కావాలనే నిర్ణయం తీసుకోవడం అనీష్‌లోని బలమైన సినీ అభిరుచికి నిదర్శనం. అయితే ఆ కలను సాకారం చేసుకోవడానికి తొందరపడకుండా, ముందుగా విద్యను పూర్తిచేసుకుని, నటనలో తగిన శిక్షణ పొందాలని నిర్ణయించుకున్నాడు. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (BBA) పూర్తిచేసిన అనంతరం అనీష్ తన నటనా కలను నిజం చేసుకునే దిశగా మరో కీలకఅడుగు వేశాడు. నటనలో మెళకువలు నేర్చుకునేందుకు అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌కు వెళ్లి ఏడాదిపాటు యాక్టింగ్‌లో శిక్షణ పొందాడు. అంతర్జాతీయ స్థాయిలో నటనకు సంబంధించిన పద్ధతులు, అభ్యాసాలను అక్కడ నేర్చుకున్నాడు. తన నటనా ప్రయాణానికి మరింత గట్టి పునాది వేసుకోవాలనే లక్ష్యంతో విశాఖపట్నంలోని ప్రముఖ సత్యానంద్ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కూడా శిక్షణ తీసుకున్నాడు. ఇలా విదేశాల్లోనూ, స్వదేశంలోనూ నటనపై అవగాహన పెంచుకుంటూ, తనలోని నటుడిని తీర్చిదిద్దుకున్నాడు. కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థిరత్వం ఉన్నప్పటికీ కేవలం పరిచయాలతో సినీ రంగంలోకి రావడం కాకుండా, తన కల కోసం విద్య, శిక్షణ, సాధనకు ప్రాధాన్యత ఇవ్వడం అనీష్ ప్రయాణంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన ఘట్టం.

తొలి చిత్రమే విభిన్నమైన సవాల్.. 'ఇట్లు అర్జున'!

ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న కలకు ఇప్పుడు కార్యరూపం ఇస్తూ అనీష్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాలో తాను మాట్లాడలేని యువకుడి పాత్రలో కనిపించనున్నాడు. తన తొలి చిత్రంలోనే మాటలు లేని పాత్రను ఎంచుకోవడం ఒక యువ నటుడిగా అనీష్‌కి అతిపెద్ద సవాలే. సంభాషణలు లేకుండా ముఖ కవళికలు, కళ్లలో భావాలు, శరీర భాష ద్వారా పాత్రలోని భావోద్వేగాలను ప్రేక్షకులకు చేరవేయడం అంత సులభం కాదు. అలాంటిది అనీష్ తన మొదటి సినిమాలోనే ఇలాంటి పాత్ర చేస్తుండడం ఆ యువ హీరోకి తన సమర్థత పట్ల వున్న నమ్మకానికి నిదర్శనం. ఈ చిత్రంలో అనీష్ సరసన మలయాళ యువ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. అర్జున్ అనే యువకుడి ప్రేమ, జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాలు, సస్పెన్స్, క్రైమ్, యాక్షన్ అంశాలతో ఈ కథ ఆసక్తికరంగా సాగనుంది. చిన్ననాటి నుంచి కీర్తిని మౌనంగా ప్రేమించే అర్జున్ జీవితంలో చోటు చేసుకునే సంఘటనలు కథకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మహేష్ ఉప్పల దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని వెంకీ కుడుముల తన 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. అక్కినేని నాగార్జున సమర్పిస్తుండటం మరో ప్రత్యేకత. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలు ఇప్పటికే అటు సంగీత ప్రియుల ఇటు సినీ అభిమానులని అలరిస్తున్నాయి.

టాలీవుడ్ ప్రముఖుల ప్రోత్సాహం, ప్రశంసలతో సినిమాపై పెరుగుతున్న అంచనాలు!

'ఇట్లు అర్జున' ప్రచార కార్యక్రమాలు ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయడం విశేషం. ట్రైలర్‌లో అనీష్ పాత్రను పరిచయం చేసిన తీరు, విభిన్నమైన కథాంశం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. రామ్‌చరణ్ సైతం చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేయడం అనీష్ తొలి చిత్రానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. అక్కినేని నాగార్జున సమర్పణ, ప్రముఖ సినీ ప్రముఖుల ప్రోత్సాహం మరియు ప్రశంసలు "ఇట్లు అర్జున" పై అంచనాలను పెంచుతున్నాయి.

యువతకు స్ఫూర్తిదాయకం.. ఈ నెల్లూరు యువ కిశోరం!

నెల్లూరులో తాతయ్యతో కలిసి చూసిన సినిమాలే ఒక బాలుడిలో నటుడు కావాలనే కోరికను రగిలించాయి. హైదరాబాద్‌లో పెరుగుతూ ఆ కలను సజీవంగా ఉంచుకున్న అనీష్, లాస్‌ఏంజెలెస్‌లో నటనను అభ్యసించి, విశాఖపట్నంలో శిక్షణ పొంది, ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు హీరోగా వస్తున్నారు. కలలు కనడం మాత్రమే కాదు, వాటిని నిజం చేసుకునేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలనే స్ఫూర్తి ఆయన ప్రయాణంలో కనిపిస్తుంది. కుటుంబ వారసత్వాన్ని గౌరవిస్తూ, తన కంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న ఆల్తూరు సాయి అనీష్‌కు 'ఇట్లు అర్జున' మంచి ఆరంభం కావాలన్నది నెల్లూరీయుల ఆకాంక్ష. నవంబర్ 13న ప్రపంచ వ్యాప్తంగా వెండితెరపైకి రానున్న 'ఇట్లు అర్జున'తో నెల్లూరు నక్షత్రం ఎలా మెరవబోతోందో ఆసక్తిగా ఎదురుచూద్దాం. చిన్ననాటి కలను నిజం చేసుకుంటున్న మన నెల్లూరు బిడ్డకు శుభ స్వాగతం పలుకుతూ ఆయన సినీ ప్రయాణం విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటోంది లాయర్!

శ్రీసిటీలో..ఐఎంఓపీ అదనపు తయారీ కేంద్రం



ఐఎంఓపీ ప్రతినిధులతో కలిసి తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

జపాన్‌కు చెందిన ప్రముఖ స్టీల్‌ప్లేట్ల ప్రాసెసింగ్ సంస్థ ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఓఎంపీ) ఈనెల 11న శ్రీసిటీలో తన రెండో తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. 2012 ఆగస్టులో శ్రీసిటీలో కార్యకలాపాలు ప్రారంభించిన ఈ సంస్థ, 2019లో ఓసారి పరిశ్రమ విస్తరణ చేపట్టగా, నేడు మరో నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ కోసం సంస్థ రూ.108 కోట్ల పెట్టుబడి పెట్టింది. దీంతో శ్రీసిటీలో ఆ సంస్థ మొత్తం పెట్టుబడులు రూ.408 కోట్లకు చేరుకున్నాయి. 12వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ విస్తరణతో సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 48వేల మెట్రిక్ టన్నుల నుంచి 60వేల మెట్రిక్ టన్నులకు పెరగనుంది. ఉత్పత్తి సామర్థ్యంలో 25 శాతం వృద్ధి నమోదుకానుంది. ఈ సంస్థలో అదనంగా 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుండడంతో సంస్థలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 850కి చేరనుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తైజో ఇవామి మాట్లాడుతూ, కొత్త ప్లాంట్ ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతో పాటు భద్రతా ప్రమాణాలు మెరుగుపరచగలమని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఐఓఎంపీ సంస్థ విస్తరణలు శ్రీసిటీపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

తెలుగు భాషోద్ధారకుడు.. సీపీ బ్రౌన్



సిపి బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వక్తలు

తెలుగు భాషకు అపార సేవలందించిన మహనీయుడు.. సీపీ బ్రౌన్ అని, తెలుగుభాషోద్ధారకునిగా ఆయన సేవలు నిరుపమానమని వక్తలు ప్రశంసించారు. చెన్నైలోని 'జనని' సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల సీపీ బ్రౌన్ 228వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డాక్టర్ నిర్మల పళనివేలు, విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య, గుడిమెట్ల చెన్నయ్య, డి.రాజేంద్రప్రసాద్ తదితరులు పుష్పాంజలి సమర్పించి ఆయన సేవలను జ్ఞాపకం చేసుకున్నారు. 'జనని' అధ్యక్షులు డాక్టర్ నిర్మల పళనివేలు మాట్లాడుతూ సీపీ బ్రౌన్‌కి తెలుగుభాష పట్ల ఉన్న అభిమానాన్ని కొనియాడారు. సీపీ బ్రౌన్ చేసిన కృషి అద్వితీయమని శివయ్య కొనియాడారు. సీపీ బ్రౌన్ తెలుగు వారందరికీ గర్వకారణమని రాజేంద్రప్రసాద్ ప్రశంసించారు. 'జనని' సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో..

చెన్నారెడ్డిపల్లి వైసీపీ నేతలు.. టీడీపీలోకి

పొదలకూరు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఆ మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో ఉన్న ముఖ్యనేతలందరూ టీడీపీలోకి చేరిపోయారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి అనంతరం వారు కాకాణికి గుడ్‌బై చెప్పేసి తెలుగుదేశం పార్టీలో చేరిపోవడం విశేషం. గ్రామంలోని ప్రముఖ నాయకులు వెలిమిరెడ్డి సుబ్బారెడ్డి, నరసింహారెడ్డితో పాటు మాలేపాటి పెంచలరెడ్డి, వెలిమిరెడ్డి జానకిరామిరెడ్డి, ఆదిశేషారెడ్డి, మూలే పెంచలకృష్ణారెడ్డి, హజరత్తయ్య, మస్తానయ్య, ప్రసాద్ తదితరులందరినీ సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సాదరంగా పార్టీలోకి స్వాగతించారు. ముఖ్యనేతలందరూ టీడీపీలో చేరిపోవడంతో చెన్నారెడ్డిపల్లిలో వైసీపీ దాదాపు ఖాళీ అయిపోయినట్లేనని ఆయన అన్నారు.

కోళ్ల పరిశ్రమ పితామహుని సేవలు అపారం!

పద్మశ్రీ బీవీరావును స్మరించుకున్న వాకర్స్ నాయకులు



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కోళ్ల పరిశ్రమ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ బీవీ రావు 91వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను జ్ఞాపకం చేసుకుంటూ నివాళులర్పించారు. కోళ్ల పరిశ్రమ భారతదేశంలో అభివృద్ధి చెందడానికి ఆయన చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు.పిడికిడంత గుడ్డులో గంపెడంత పోషకాలు ఉన్నాయని, కోడిగుడ్డు మంచి పౌష్టికాహారమని, పేదవారికి కూడా ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని 203-వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మరియు నెక్ మాజీ జోనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు చెప్పారు. అనంతరం, ఏసీ స్టేడియంలో ఉన్న వాకర్స్‌కు, క్రీడాకారులకు ఆరువందల ఉడికించిన కోడిగుడ్లను బెజవాడ సునీల్ రెడ్డి దాతృత్వంతో పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్‌అహ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, బిరదవోలు రామ్‌మోహనరెడ్డి, జీవీ కృష్ణయ్య బెల్లం చెంచయ్యనాయుడు, మాగంటి ప్రసాద్, వినుకొండ వెంకటేశ్వర్లు, పత్తిపాటి రమణయ్య, సదానందరెడ్డి, కొండిశెట్టి వెంకటరమణ, గువ్వల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మరో పీఆర్‌పీ!

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాల్లో పార్టీలు పుట్టడం కొత్త కాదు. కానీ ఒక పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, ఆ పార్టీ అధినేతతో విభేదించి బయటకు వచ్చిన నాయకుడు సొంత పార్టీ పెట్టడం మాత్రం రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన పరిణామమే. అయితే పార్టీ పేరు ప్రకటించగానే ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా గుర్తింపు లభించదు. అందుకు ప్రజల్లో విశ్వసనీయత, క్షేత్ర స్థాయిలో బలం, బలమైన నాయకత్వ బృందం, స్పష్ట మైన విధానాలు, ఎన్నికల్లో గెలిచే సత్తా ఉండాలి. ఈ ప్రాథమిక అర్హతలను విజయసాయిరెడ్డి పార్టీ ఎంతవరకు అందిపుచ్చుకుంటుందన్నదే అసలు ప్రశ్న.

పీఆర్‌పీ పేరుతో కొత్త రాజకీయ ప్రయోగం!

గత సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఘోర పరాజయం పాలైన విజయసాయిరెడ్డి రాజకీయ ప్రస్థానం ఆ తర్వాత అనూహ్య మలుపులు తిరిగింది. రాజకీయాలకు దూరంగా ఉంటానన్న సంకేతాలు ఇచ్చిన ఆయన వ్యవసాయం, సామాజిక అంశాలు, మీడియా రంగం వంటి విభిన్న అంశాలపై ఆసక్తి ప్రదర్శించారు. వ్యవసాయదారుడిగా, మీడియా సంస్థల నిర్వాహకుడిగా తన భవిష్యత్ ప్రయాణాన్ని పరిచయం చేసుకున్నారు. ఇప్పుడు యూటర్న్ తీసుకుని మరోసారి రాజకీయాల వైపు మళ్లి ఏకంగా పార్టీ స్థాపించడంతో ఈ లెక్కల మాంత్రికుడు పూర్తిస్థాయి రాజకీయ తాంత్రికుడిగా అవతరించారు. గతంలో ఆర్థిక వ్యవహారాలు, కంపెనీల నిర్మాణం, షెల్ కంపెనీల ఆరోపణలు, జగన్ అక్రమాస్తుల కేసు వంటి వివాదాల్లో విజయసాయిరెడ్డి పేరు తరచూ వినిపించింది. ఆ కేసుల్లో అయన ఏ-2 జైలుకి కూడా వెళ్లారు. జగన్ కేసులలో సాయిరెడ్డి పాత్రపై రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలు, న్యాయపరమైన పరిణామాలు ఆయనని వెంటాడుతూనే ఉన్నాయి. ఇలాంటి నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి ఇప్పుడు నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాల గురించి మాట్లాడుతుండటాన్ని ప్రత్యర్థులు ప్రశ్నిస్తున్నారు. గత రాజకీయ జీవితంపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వకుండా కొత్త రాజకీయాలకు నాంది పలికితే విశ్వసనీయత ఎలా వస్తుందని నిలదీస్తున్నారు.

జగన్‌పై రాజకీయ కక్షనా.. వైసీపీలో చీలిక వ్యూహమా?

పార్టీ ప్రారంభోత్సవం నుంచే విజయసాయిరెడ్డి ప్రసంగం ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 2026 , 11వ నెల, 11 గంటల 11 నిమిషాల ముహూర్తంలో పార్టీని ప్రకటించడం ద్వారా వైసీపీకి ప్రస్తుతం ఉన్న 11 స్థానాల సంఖ్యను గుర్తుచేసే ప్రయత్నం చేశారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైసీపీ నిర్మాణంలో తన పాత్రను గుర్తుచేసుకుంటూనే, ఆ పార్టీ కోసం కష్టపడిన అసలైన కార్యకర్తలకు తన పార్టీ తలుపులు తెరిచి ఉంటాయని ప్రకటించడం వెనుక రాజకీయ వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. జగన్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న ద్వితీయశ్రేణి నాయకులు, గుర్తింపు దక్కలేదని భావిస్తున్న కార్యకర్తలు, పార్టీ నుంచి దూరమైన నేతలను తనవైపు తిప్పుకోవాలన్న ప్రయత్నంగా దీనిని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. జగన్ ప్రజలకు దూర మయ్యారని, పరదాల మధ్య పర్యటనలు చేస్తూ కోటరీ రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చారని విజయసాయిరెడ్డి చేసిన విమర్శలు కూడా సాధారణ రాజకీయ వ్యాఖ్యలు కావు. ఒకప్పుడు జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించిన వ్యక్తి నుంచే ఇలాంటి విమర్శలు రావడం వైసీపీ నాయకత్వానికి రాజకీయంగా ఇబ్బంది కరమే. అయితే ఇక్కడ మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. జగన్ నాయకత్వంలోని లోపాలు విజయసాయిరెడ్డికి ఇంతకాలం కనిపించలేదా? అధికారంలో ఉన్నప్పుడు ఇదే కోటరీ వ్యవస్థపై ఎందుకు ప్రశ్నించలేదు? పార్టీ అధికారంలో ఉన్నంతకాలం కీలక పదవులు, రాజకీయ ప్రాధాన్యత అనుభవించి, అధికారం కోల్పోయిన తర్వాతే వ్యవస్థలో లోపాలు గుర్తుకొచ్చాయా? అన్న ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాల్సి ఉంటుంది. జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం ఒక రాజకీయ వ్యూహం కావచ్చు. కానీ జగన్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు విజయసాయిరెడ్డిని ఎందుకు ఎంచుకోవాలి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం అంత సులభం కాదు.

చంద్రబాబుపైనా విమర్శలు.. రెండు పడవల ప్రయాణమా?

విజయసాయిరెడ్డి విమర్శలు జగన్‌తోనే ఆగలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపైనా తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. గ్రాఫిక్స్‌లో అభివృద్ధి చూపిస్తున్నారని, వ్యవస్థలను ఎల్లకాలం మేనేజ్ చేయలేరని, టీడీపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. గత రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ చంద్రబాబుపై ఘాటు విమర్శలు చేశారు. ఒకవైపు జగన్ నాయకత్వాన్ని ఎండగడుతూ, మరోవైపు చంద్రబాబు పాలనను తప్పుబడుతూ విజయసాయిరెడ్డి తన పార్టీకి స్వతంత్ర రాజకీయ గుర్తింపు తీసుకురావాలని తపన పడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇక్కడే ఆయనకు అసలైన రాజకీయ పరీక్ష ఎదురుకానుంది. జగన్‌ను వ్యతిరేకించే ఓటర్లు తప్పనిసరిగా విజయసాయిరెడ్డి వెంట నడుస్తారా? చంద్రబాబును వ్యతిరేకించే ప్రజలు ఆయన పార్టీకి మద్దతు ఇస్తారా? రెండు ప్రధాన పార్టీలపై విమర్శలు చేయడం ద్వారా మూడో శక్తి నిర్మాణం సాధ్యమవుతుందా? అన్నది ప్రశ్నార్థకమే. రాజకీయాల్లో విమర్శలు చేయడం సులభం. కానీ ప్రజల సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపడం, బలమైన కేడర్‌ను నిర్మించడం, ప్రజా ఉద్యమాలు నిర్వహించడం, ఎన్నికల్లో ఓట్లుగా మార్చుకోవడం మాత్రం పూర్తిగా భిన్నమైన ప్రక్రియ.

నీతి వచనాలపై నెటిజన్ల సెటైర్లు!

రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిబద్ధతలకు తానే ప్రతిరూపమన్నట్లుగా విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. ముఖ్యంగా జగన్ అక్రమాస్తుల కేసులో ఏ-2గా ఆయన గతంలో ఎదుర్కొన్న న్యాయపరమైన పరిణామాలను ప్రస్తావిస్తూ, బెయిలుపై బయటున్న వ్యక్తి పరివర్తన , రాజనీతి అంటే జనం నమ్ముతారా? అని నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆర్థిక నేరస్తుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి ఇప్పుడు అవినీతిరహిత రాజకీయాల గురించి మాట్లాడితే ప్రజలు ఎలా విశ్వసిస్తారన్నది జనం వాదన. పార్టీ ప్రారంభోత్సవంలో విజయసాయిరెడ్డిని యువనేతగా, 'సాయన్న'గా అభివర్ణించడం కూడా సోషల్ మీడియాలో వ్యంగ్యానికి కారణమైంది. యువత, జెన్‌జీ రాజకీయాలు, కొత్త తరం నాయకత్వం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలపై కూడా సెటైర్లు వినిపిస్తున్నాయి.

మరో కేపీ పాల్‌గా మిగిలిపోతారా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మూడో శక్తి ఆవిర్భావం కొత్త అంశం కాదు. గతంలో ప్రజారాజ్యం పార్టీ భారీ అంచనాలతో రాజకీయాల్లోకి వచ్చి, గణనీయమైన ఓటు శాతం సాధించినప్పటికీ అధికారాన్ని అందుకోలేకపోయింది. ఆ తర్వాత పార్టీ విలీనం కావడంతో ఆ రాజకీయ ప్రయోగం ముగిసింది. ఇక కేఏ పాల్ రాజకీయ ప్రయాణం కూడా ప్రకటనలు, భారీ లక్ష్యాలు, సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచినప్పటికీ ఎన్నికల రాజకీయాల్లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోగా అయన పెద్ద పొలిటికల్ కెమెడియన్‌గా మిగిలిపోయారనే విమర్శలున్నాయి. ఇప్పుడు విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ప్రకటించడంతో ఈ రెండు రాజకీయ ప్రయోగాలు మళ్లీ చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ ప్రారంభోత్సవంలోనే పరివర్తన, రాజనీతి వంటి మాటలు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజయసాయిరెడ్డికి ఎంతో కొంత రాజకీయ పరిజ్ఞానం ఉంది. అధికార వ్యవస్థలతో పరిచయం ఉంది. వైసీపీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన అనుభవం ఉంది. కానీ ఇవేవీ కొత్త పార్టీ విజయానికి హామీ ఇవ్వవు. ఒకప్పుడు జగన్‌కు బలమైన రాజకీయ వ్యూహకర్తగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తన సొంత పార్టీకి ఎంతమంది నాయకులను, కార్యకర్తలను సమీకరించుకోగలరన్నదే అసలు పరీక్ష. ప్రజల్లో విస్తృతమైన మాస్ ఫాలోయింగ్, బలమైన సామాజిక పునాది, గ్రామస్థాయి పార్టీ నిర్మాణం లేకుండా కేవలం మీడియా ప్రకటనలతో రాజకీయాల్లో నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. అందుకే ఈ కొత్త పీఆర్‌పీని ఇటు రాజకీయ పరిశీలకులు అటు ఆంధ్రా ప్రజలు ఇప్పటికిప్పుడు మూడో ప్రత్యామ్నాయంగా అంగీకరించడానికి సిద్ధంగా లేరు. విజయసాయిరెడ్డి స్థాపించిన పరివర్తన రాజనీతి పార్టీకి అసలైన సవాల్ ప్రత్యర్థి పార్టీలు కావు. ఆయన గత రాజకీయ ప్రస్థానం, ప్రజల్లో ఉన్న అభిప్రాయం, తనపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో ఏర్పడిన విశ్వసనీయత సమస్యలే ప్రధాన సవాళ్లు.జగన్‌ను విమర్శించడం ద్వారా వైసీపీ వ్యతిరేక ఓటును, చంద్రబాబును విమర్శించడం ద్వారా టీడీపీ వ్యతిరేక ఓటును తనవైపు తిప్పుకోవచ్చని భావిస్తే అది రాజకీయ అపోహే అవుతుంది. ఎందుకంటే ప్రజలు కేవలం వ్యతిరేకత ఆధారంగా ఓట్లు వేయరు. తమకు నమ్మకం కలిగించే నాయకుడిని, స్పష్టమైన విధానాలను, భవిష్యత్తుపై భరోసా ఇచ్చే రాజకీయశక్తిని కోరుకుంటారు. మొత్తానికి, విజయసాయిరెడ్డి పార్టీ పెట్టడం ఒక కీలక రాజకీయ పరిణామమే తప్ప, అది రాజకీయ సంచలనం అవుతుందని ఇప్పుడే చెప్పలేం. 'పరివర్తన' అనే పేరుతో పార్టీ పెట్టినంత మాత్రాన ప్రజల్లో పరివర్తన రాదు. ముందుగా తన రాజకీయ విశ్వసనీయతను నిరూపించుకోవాలి. గతానికి సమాధానం చెప్పాలి. ప్రజలకు భవిష్యత్తుపై భరోసా కల్పించాలి. లేకపోతే జగన్‌పై ఆగ్రహం, చంద్రబాబుపై విమర్శలు, సంచలన ప్రకటనలతో ప్రారంభమైన ఈ కొత్త రాజకీయ ప్రయాణం మరో కేపీ పాల్ తరహా రాజకీయ ప్రయోగంగా మిగిలిపోయే ప్రమాదం ఉందని, అదే జరిగితే ఈ ఏ-2 కేపీ. పాల్-2 గా అవతరించి రాష్ట్ర రాజకీయ చరిత్రలో పొలిటికల్ కెమెడియన్‌గా నిలిచిపోతాడనే అభిప్రాయాలూ వినవస్తున్నాయి. అప్పుడు పరివర్తన రాజనీతి పార్టీగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో పీఆర్‌పీగా చరిత్రలో కలిసిపోవడం ఖాయం అన్నది విశ్లేషకులు చెప్తున్న జోస్యం!

విక్రమ్‌పై ఆనం ఫైర్!

'మర్డర్ ఆఫ్ డెమోక్రసీ' అనడంపై తీవ్ర ఆగ్రహం



➢ మేకపాటికి మంత్రి వార్నింగ్

ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే.. వైఎస్సార్సీపీ నేత మేకపాటి విక్రమ్ రెడ్డి స్థానిక ఎన్నికల సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫైర్ అయ్యారు. ముఖ్యంగా, ప్రజాస్వామ్య వ్యవస్థపై కనీస గౌరవం లేకుండా 'ప్రజాస్వామ్య హత్య' (మర్డర్ ఆఫ్ డెమోక్రసీ) అంటూ విక్రమ్ వ్యాఖ్యానించడం పట్ల ఆనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనం మేకపాటి కటుంబరాజకీయాల తీరుపై ధ్వజమెత్తారు. దౌర్జన్యాలు చేయడం, దోచుకోవడం, నాటుబాంబులు వేసి రాజకీయ పదవులు పొందాలను కోవడం మీకు, మీ కుటుంబానికి అలవాటని, ఆస్తులు కొట్టేయడమే కాకుండా చివరికి కేంద్రం డబ్బును కూడా కాజేశారని విమర్శించారు. అయితే అలాంటివి ఇక సాగవన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానిస్తారా?..

స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తీర్పునిచ్చిన ఎన్నికల ఫలితాలను 'ప్రజాస్వామ్య హత్య'గా అభివర్ణించడం రాజ్యాంగ వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియను అవమానించడమేనని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాల్సిన బాధ్యత ఉందని మంత్రి గుర్తు చేశారు. ఎన్నికల ప్రక్రియను, అధికారులను, ఎన్నికల కమిషన్‌ను విమర్శించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో అపనమ్మకం కలిగించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. 2019లో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్షాలకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో స్వేచ్ఛగా పోటీచేసే పరిస్థితులు కల్పించారా..? అని ఆయన ప్రశ్నించారు. నాడు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచిన వారు నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల అధికారులు, రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరాధార విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. రాజ్యాంగ వ్యవస్థను కించపరిచే వ్యాఖ్యలపై, న్యాయనిపుణులతో సంప్రదించి, చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలన జరుపుతామని, ఈ అంశాలను ప్రభుత్వ, న్యాయ వ్యవస్థల దృష్టికి తీసుకెళ్తామని కూడా మంత్రి స్పష్టం చేశారు.

మేకపాటి కుటుంబ రాజకీయాలపై.. మంత్రి ఘాటు విమర్శలు :

మేకపాటి కుటుంబానికి చెందిన కొందరు నాయకులు గతంలో రాజకీయాల్లో వ్యవహరించిన తీరుపై మంత్రి ఆనం తీవ్ర విమర్శలు చేశారు. అప్పట్లో జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ, ఆ పాత చిట్టా అంతా విప్పారు. 1980, 1990 దశకాలలో ఆత్మకూరు, మర్రిపాడు ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు, పోలీస్‌స్టేషన్‌పై దాడులు, రాజకీయ ప్రత్యర్థులపై దాడులు వంటి అంశాలను గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే ముందు గత చరిత్రను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కృష్ణమోహన్ కన్‌స్ట్రక్షన్స్ (కేఎంసి) గురువాయూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన కేరళ రాష్ట్రంలోని జాతీయ రహదారి కాంట్రాక్టు వ్యవహారాన్ని మంత్రి గుర్తుచేస్తూ, పాలక్కాడ్ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం పూర్తయినట్లు చూపించి టోల్ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై ఎన్‌హెచ్‌ఏఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు, కేసులు, ఆస్తుల జప్తు అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈడీ అధికారులు సుమారు రూ. 125.21 కోట్ల విలువైన ఆస్తులు లేదా బ్యాంకు ఖాతాలను జప్తు చేసినట్లు మంత్రి తెలిపారు. మీపై నకిలీ పత్రాలు, ఫోర్జరీ ఆరోపణలపై పలు సెక్షన్ల కింద కేసులున్నాయని, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు వివరణ ఇవ్వాలని అన్నారు. తమపై రాజకీయ విమర్శలు, ఆరోపణలకు ప్రజాసేవే సమాధానమన్నారు.

రాష్ట్రానికి..6 జాతీయ అవార్డులు

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా 'స్వచ్ఛ' అవార్డులు అందుకున్న మంత్రి నారాయణ



కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ 6 అవార్డులను సాధించింది. ఈ ఏడాది రాష్ట్రానికి జాతీయస్థాయిలో ఏకంగా 6 అవార్డులు లభించడం విశేషం. గత ఏడాది 78 అవార్డుల్లో 5 అవార్డులు సాధించిన మన రాష్ట్రం, ఈసారి మొత్తం 60 అవార్డుల్లో 6 అవార్డులు కైవసం చేసుకుంది. దీంతో జాతీయ స్థాయిలో రాష్ట్రం సాధించిన అవార్డుల శాతం 12.5 నుంచి 25 శాతానికి పెరిగిందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు.

న్యూఢిల్లీలో ఈనెల 11న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఆ అవార్డులు అందుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, తిరుపతి, కుప్పం నగరాలకు ఈ అవార్డులు దక్కాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సత్ఫలితాలిస్తోందన్నారు. పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, వ్యర్థాల శుద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 153 లక్షల టన్నుల చెత్తను, పాత వ్యర్థాలను తొలగించామని, తొలి ఏడాదిలోనే 85లక్షల టన్నుల చెత్తను తొలగించినట్లు మంత్రి ఈ సందర్భంగా వివరించారు. చెత్త ప్రాసెసింగ్ కోసం 106ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వగా, ఇప్పటికే 60 ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయని, మరో 26 ప్లాంట్లను త్వరలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణాన్ని వచ్చే ఏడాదిన్నరలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో 50శాతం గ్రీన్ కవర్ సాధించాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని, పచ్చదనం అభివృద్ధికి హెచ్ఏఎం ప్రాజెక్టు కింద రూ. 900 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టణాభివృద్ధికి రూ. 50 వేల కోట్లతో వివిధ పనులు చేపడుతున్నామని, రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలను స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

పంచాయతీల్లోనూ..ఇక మహిళలదే హవా!

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పంచాయతీ ఎన్నికల్లో 50 శాతం (సగం) స్థానాలు మహిళలకు రిజర్వు కావడం, గ్రామాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇక పల్లె పాలనలో కూడా మహిళలు తమ సత్తా చాటుకోబోతున్నారు. జిల్లాలో 7వందల పంచాయతీలలో 343 మంది సర్పంచ్‌ల స్థానాలు మహిళలకు రిజర్వు అయ్యాయని తెలుస్తోంది. వీరిలో 28 పంచాయతీల్లో ఎస్టీ మహిళలు, 79 స్థానాల్లో ఎస్సీ మహిళలు, 52 చోట్ల బీసీ మహిళలు, వీరితోపాటు అన్‌రిజర్వుడు స్థానాల్లో 184 మంది పోటీచేయనున్నారు. అదేవిధంగా, గ్రామస్థాయిలో 6,668 వార్డుల్లో 3,328 వార్డులను మహిళలకే కేటాయించారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com